

# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 18-09-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 07 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## కేంద్రం తీరుపై చంద్రబాబు ఆగ్రహం



అమరావతి: కేంద్రం తీరుపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు తర్వాత పదేళ్లు టాక్స్ మాఫీ చేయాలని కోరామని, ప్రజల కోసం చేసే పనులకు సహకరించాలని డిమాండ్ చేశారు. కడప స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేసేవరకు వదిలిపెట్టమని, పోరాడి సాధిస్తామని ఆయన స్పష్టం చేశారు. రాయలసీమ డిక్లరేషన్ పెట్టిన పెద్ద మనుషులు.. స్టీల్‌ప్లాంట్ కోసం ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. రాయలసీమపై ఎనలేని ప్రేమ ఉన్నట్టు మాట్లాడుతున్నారని కేంద్రంపై చంద్రబాబు మండిపడ్డారు.

12 విద్యాసంస్థలకు 11 వేల కోట్ల విలువైన భూములు ఇస్తే.. కేంద్రం రూ.746 కోట్లు మాత్రమే ఇచ్చింది. నామమాత్రపు నిధులతో ఎన్నేళ్లకు భవనాలు నిర్మిస్తారు? గిరిజన యూనివర్సిటీ ఊసే లేదు. మేం సెంట్రల్ వర్సిటీ అడిగితే ఇవ్వలేదు.. బీహార్‌కు ఇచ్చారు. చట్టంలో దుగరాజపట్నం పోర్టు ఏర్పాటు చేయాలని పెట్టారు. ఇప్పుడు రామాయపట్నం పోర్టు అంటున్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్‌కు కేంద్రం ఏమీ ఇవ్వలేదు. ఏడీబీ రుణం తీసుకున్నాం. పెట్రో కెమికల్ కాంప్లెక్స్, గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ ఏమైంది? మోదీ ప్రధాని అయ్యాక అప్పుల్లో ఉన్న గుజరాత్ ఆయిల్ కంపెనీని హెచ్‌పీసీఎల్‌లో విలీనం చేశారు. గుజరాత్ ఆయిల్ కంపెనీకి రూ.29 వేల కోట్ల సాయం చేశారు. ఏపీకి సాయం చేయడానికి మోదీకి మనసు రాలేదు. లాభాలు వచ్చేది ఏపీలో.. నష్టాలు పూడ్చేది గుజరాత్‌లో అంటూ చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 11 మంది స్వామీజీల ఆశీస్సులతో.. రాహుల్ రణభేరి!



భోపాల్: 11 మంది హిందూ మతాచార్యుల ఆశీర్వాదం, భారీ రోడ్‌షో మధ్య కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ ఇవాళ మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఉదయం భోపాల్ విమానాశ్రయంలో దిగిన రాహుల్ గాంధీకి కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమల్‌నాథ్, పార్టీ సీనియర్ నేత, గుణా ఎంపీ జ్యోతిరాదిత్య సింధియా తదితరులు రాహుల్‌కి ఎదురేగి స్వాగతం పలికారు. రాహుల్ గాంధీని శివ భక్తుడిగా పేర్కొంటూ నగరంలో పెద్ద ఎత్తున బ్యానర్లు వెలిశాయి. ఆయన రాక సందర్భంగా దారిపొడవునా రాహుల్ గాంధీ జిందాబాద్ అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. గత 15 ఏళ్లుగా బీజేపీ పాలన కింద ఉన్న మధ్యప్రదేశ్లో మళ్లీ పాగా వేసేందుకు కాంగ్రెస్

తరువాయి 2లో..

## భూములు కనిపిస్తే కబ్జా చేస్తున్నారు

- నవరత్నాలతో అన్ని వర్గాలను ఆదుకుంటాను
- హుద్ హుద్ తుఫాను పేరుతో రికార్డులు మాయం
- భీమిలిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు
- ప్రత్యేక హోదా రాకపోవడానికి చంద్రబాబే కారణం
- ఆనందపురం బహిరంగ సభలో వైఎస్ జగన్





ప్రజాసంకల్పయాత్రలో భాగంగా ఆనందపురం రహదారిలో జగన్ అన్న అడుగులో అడుగు వేస్తూ మహానేత రాజన్న హయంలో పేద ప్రజల ఆరోగ్య భోరసా కొరకు ప్రవేశ పెట్టిన ఆరోగ్య శ్రీ పథకం పై చర్చిరిస్తున్న దక్షిణ నియోజక వర్గ సమన్వయకర్త డా. పైడి వెంకటరమణమూర్తి

ఆనందపురం: భీమిలి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ఎక్కడ భూములు కనిపించినా కబ్జా చేస్తున్నారని ప్రతిపక్షనేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చంద్రబాబు నాయుడి పాలనపై మండిపడ్డారు. 264వ రోజు ప్రజాసంకల్పయాత్రలో భాగంగా ఆనందపురం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అశేష జనవాహిని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

భీమిలిలో తిరుగుతున్నప్పుడు ఇక్కడి ప్రజలు నా దగ్గరకు వచ్చి మా మంత్రి గంటా శ్రీనివాసరావు, సీఎం చంద్రబాబు ట్రైనింగ్‌లో ఆరితేరిపోయాడు. ఎన్నికలు వచ్చేప్పటికి దొంగల ముఠా స్థావరాలు మార్చినట్లు ఆయన తన నియోజకవర్గాలను మారుస్తాడన్నా అని అంటు న్నారు. భీమిలీ, ఆనందపురం, మధురవాడ తహసీల్దార్ ఆఫీసుల్లో జరగిన అవినీతిపై సీట్ ముందు ప్రజలు బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మంత్రి గంటా అండదండలతో ఎమ్మార్వోలు అన్యాయాలు చేస్తున్నారు. హుద్ హుద్ తుఫాను పేరుతో రికార్డులను మాయం చేశారు. పేదలను భయపెట్టి అసైన్డ్ భూములను కొంటారు. తర్వాత ల్యాండ్ పూలింగ్ పేరుతో దందా చేస్తారు.

మంత్రి గంటా వియ్యంకుడు నారాయణ. ఆయన విద్యాసంస్థల్లో ఫీజులు పెంచడానికి మంత్రి గంటా గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. ఇదే నారయణ కాలేజీల్లో సుమారు 30 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు.

కాలేజీలు మూసేయిం చాల్సిన మంత్రి మౌనం వహిస్తారు. ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసి నారయణ విద్యాసంస్థలను ప్రోత్సహిస్తారు.

ఆంధ్ర యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్ట్‌లను భర్తీ చేయకుండా నిర్వీర్యం చేసి చంద్రబాబు బంధువైన ఎంవీవీఎస్ మూర్తి గీతం యూనివర్సిటీకి

తరువాయి 7లో..

## మోహినీ అవతారంలో శ్రీవారు



తిరుమల: తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఐదో రోజైన సోమవారం ఆపద మొక్కులవాడు మోహినీ అవతారంలో సాక్షాత్కరించి భక్తులకు కనువిందు చేశాడు. దంతపు పల్లకిలో శ్రీ కృష్ణస్వామి తోడుగా మాఢ వీధుల్లో ఊరేగారు. భక్త బృందాల కోలాటాలు, అన్నమయ్య సంకీర్తనా గానాలు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారుల బృందాలు భక్తులను అలరించాయి.

## ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 68వ జన్మదినం సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు వెల్లువలా వస్తున్నాయి. ట్విటర్ వేదికగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సహా పలువురు ప్రముఖులు ఆయనకు శుభా కాంక్షలు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు. మీరు దీర్ఘాయువుతో వర్థిల్లాలనీ, ఇంకా అనేక సంవత్సరాలు దేశ ప్రజలకు సేవ చేయాలని కోరుకుంటున్నాను... అని రాష్ట్రపతి ట్వీట్ చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ట్విటర్లో స్పందిస్తూ... భారత విశిష్ట, శక్తిశీల ప్రధాని నరేంద్ర మోదీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఆయనకు

తరువాయి 2లో..

## అగ్నిప్రమాదంలో సినిమాహాళ్ళు దగ్ధం

### - సుమారు రూ.5కోట్లు నష్టం
### - యాజమాన్యమే తగలబెట్టిందనేది స్థానికుల అనుమానం



గాజువాక: పారిశ్రామికప్రాంతం గాజువాక ప్రదాన రహదారి సమీపంలోని సోమవారం ఉదయం సంభవించిన అగ్నిప్రమాదంలో ప్రముఖ సినిమాహాల్స్ కన్యాశ్రీకన్యా రెండుథియోటర్స్ దగ్ధం అయ్యాయి. విలువైన పరికరాలు తదిర సామగ్రి పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ. 5కోట్ల నష్టం జరిగినట్లు యాజమాన్యం అంచన. స్థానికులు, యాజమాన్యం తెలిపిన వివరాలప్రకారం........ తెల్లవారిజామున పై అంతస్తుల్లో ఒక్కసారీ మంటలు చెలరేగి, పరిసరప్రాంతంలో పూర్తిగా వ్యాపించడంతో సినిమాహాల్లో విధులు నిర్వహిస్తున్న స్వీపర్ చిట్టెమ్మ మేనేజర్‌కు సమాచారం అందించింది. ఆయన అగ్నిమాపక అధికారులకు ఫిర్యాదు చేయడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వచ్చేసరికి పూర్తిగా దగ్ధం అయ్యాయని స్థానికులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపులోనికి తేవడంతో స్థానికులు ఊపరి పీల్చికున్నారు. ఈ ఘటనలో రెండు తెరలు, సీట్లు, ప్రొజెక్టర్, ఏసీ యూనిట్లు తదితర విలువైన సామగ్రి పూర్తిగా దగ్ధం అయిపోవడంతో దీని విలువ సుమారు రూ. 5కోట్లు నష్టంగా దియోటర్ మేనేజర్ రమణబాబు తెలిపారు. థియోటర్‌లో ప్రేక్షులు ఎవరు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పిందని రమణబాబు తెలిపారు. థియోటర్ సముదాయంలో ఉన్న ఫైర్ అలారం పనిచేయకపోవడంతో భారీ నష్టం జరిగిందని ప్రాథమికంగా అధికారులు అంచనా వేసారు. విద్యుత్‌ఘాతంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఢీసిపి-2ఫకీరప్ప సమగ్ర విచారణ జరిపించనున్నట్లు తెలిపారు.

**అగ్నిప్రమాదంపై పలు అనుమానాలు.........**

అగ్నిప్రమాదం జరిగిన తీరును క్షుణ్ణంగా పరిశీలించినట్లైతే కావాలనే యాజమాన్యం ఈ పనికి ఒడిగట్టిందని ఊహాగానాలు వ్యక్తంమవుతున్నాయి. ఈ ప్రచారం వాస్తవం ఎంతో తెలియనప్పటికీ భీమా పరిహారంకోసం కోసమా? లేక ప్రస్తుత ప్రదేశంలో మల్టీప్లెక్స్ థీయోటర్స్ నిర్మించేందుకా అని ఊహాగానాలు వ్యక్తంమవుతున్నాయి. ఏది ఏమైన ప్రమాదం గురించి తెలిసిన వెంటనే సంఘటనా స్థలంనకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బందితీరును, డీసీపి-2ఫకీరప్ప తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని తీసుకున్న చర్యలను స్థానికులు ప్రశంసిస్తున్నారు. సిబ్బంది దగ్గరుండి సహాయ కార్యక్రమాలను సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవడంతో భారీ ప్రాణ నష్టం తప్పిందని స్థానికులు హార్షం వ్యక్తం చేసారు.





# ప్లాస్టిక్ వేస్ట్ పెరగకుండా చర్యలు తీసుకోవాలి

యు.ఎన్.ఎక్స్‌పెర్ట్ డా.జెన్నా జెంబెక్ (Jenna Jambeck) - ప్లాస్టిక్ వేస్ట్ -మైరైన్ పొల్యూషన్ పై స్టేక్ హోల్డర్స్ సమావేశం

- ప్లాస్టిక్ ఉత్పత్తి -వేస్ట్ పెరగకుండా నియంత్రించుకోవాలి
- ప్లాస్టిక్ వ్యర్థాల సమర్థ నిర్వహణ అవసరం
- ప్రత్యామ్నాయంగా కాగితం, గుడ్డ సంచులు, వినియోగం పెరగాలి



విశాఖపట్నం :- ప్లాస్టిక్ వ్యర్థాలు పెరగకుండా ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని యు.ఎన్.ఎక్స్‌పెర్ట్ డా.జెన్నా జెంబెక్ (Jenna Jambeck)పేర్కొన్నారు. యు.ఎన్.డి.పి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజిమెంట్ పై స్టేక్ హోల్డర్స్ తో సోమవారం సమావేశం కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత 20 సంవత్సరాలుగా ప్లాస్టిక్ వ్యర్థాలు, గ్లోబల్ వేస్ట్ సమస్యలపై రీసెర్చ్ చేస్తున్నట్లు వివరించారు. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా ప్లాస్టిక్ పాలసీ కోసం గ్లోబల్ ఓషన్ కమిషన్ పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. 2015 నాటికి ప్లాస్టిక్ వేస్ట్ 6. 3 బిలియన్ మెట్రిక్ టన్నులుండగా 2050 నాటికి 12 బిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకునే అవకాశం ఉన్నట్లు ఒక అంచనాగా వివరించారు. అదేవిదంగా ప్లాస్టిక్ ఉత్పత్తులు కూడా పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరుప్లాస్టిక్ ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకంపై స్వయం నియంత్రణ పాటించాలని పిలుపునిచ్చారు. ఏ.యు ప్రొఫెసర్ బాల ప్రసాద్, ఉదయభాస్కర్ రెడ్డి, డా.షిరీన్ రెహమాన్, ఎన్.జి.ఓ హట్టగడి, సుచిత్ర, ఫ్లయెంట్ గ్రిడ్ రవికాంత్, సి.యం.ఓ.హెచ్ డా.ఏ.హేమంత్, తదితరులు పలు సలహాలు, సూచనలు చేశారు. యుఎన్‌డిపి కన్వీనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నిట్టమామిడి అంగన్వాడీ కార్యకర్త అమ్మాజికి న్యాయం చేయాలి

అంగన్వాడి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అప్పలరాజు డిమాండు



న్యాయం చేయాలని వేడుకుంటున్న అమ్మాజి



జేసి-2 సిఫిర్యాదు చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం : నిట్ట మామిడి అంగన్వాడీ కార్యకర్త అమ్మాజికి న్యాయం చేయాలని అంగన్వాడి అసోసియేషన్(ఏఐటియుసి) జిల్లా అధ్యక్షులు అప్పలరాజు డిమాండ్ చేశారు. ఆరు మాసాలుగా అంగన్వాడీ కార్యకర్తలకు జీతం రాకుండా విధులు నిర్వహించడానికి అవకాశం లేకుండా అధికారులు ఆలోచించడం తగదని డిమాండ్ చేశారు. జి.మాడుగుల ప్రాజెక్టు పరిధిలోని నిట్ట మామిడి అంగన్వాడీ కార్యకర్త ఆరుమాసాల క్రితం అప్పటి సిడిపిఒ ప్రమీల, స్థానిక డీలరు నిర్లక్ష్యం కారణంగా తాను బలి అయ్యానంటూ గ్రామస్థులతో కలిసి గతంలోనే కలెక్టర్‌కి విన్నవించడం జరిగిందన్నారు. గత ఆరు నెలలుగా వేతనాలు అందక వికలాంగుడైన కుమారుడితో వికలాంగురాలైన అంగన్వాడీ కార్యకర్త జీవనం అగమ్యగోచరంగా ఉందని అప్పల రాజు పేర్కొన్నారు.

ఇకనైనా అధికారులు త్వరితగతిన సమస్యను పరిష్కరించి అమ్మాజికి న్యాయం చేయాలని ఆయన కోరారు. ఇదే విషయమై జెసి2 సిరి ఐసిడిఎస్ ఆర్‌జేడి రాబర్ట్‌తో చర్చించి తదుపరి చర్యలకు ఉపక్రమించాలని సూచించారని అప్పలరాజు తెలియజేశారు.

# జాతీయస్థాయి చాలెంజ్‌లో చాణుక్య స్కూల్

బాల మేధావులు.. అవార్డుగ్రహీతలు



విజయనగరం: వారు నిజంగా మేధావులే... పరిశోధనా ఆసక్తికి వారే ప్రేరణ. ప్రకృతిలో మట్టిని ప్రేమించి...దానిలో మొక్కలకు ఉండే స్వభావాలు గమనించారు. వారి కుటుంబనేపథ్యంలో పూర్వీకులు మొక్కల నుంచి ఔషదాలను తయారు చేయడం విని దానిమీదే దృష్టి పెట్టారు. గత ఏడాదిగా ఏడుగురు విద్యార్థులు ఆ పనిలో పడ్డారు. సుబ్రమణ్యం అనే ఒక పర్యవేక్షకుని సహాయంతో మొక్కలను పరిశీలించారు. ఆయుర్వేద వైద్యులు వర్మ గారిని కలిసారు. వారి సలహ తీసుకున్నారు. ఏ మొక్కలు ఏలా పిశీలించాలి. వాటి గుణాలను ఎలా కని పెట్టాలో పసిగెట్టారు. 350 మొక్కలను అలా వారి ప్రయోగాలకు వాడుకున్నారు. అందులో 30 మొక్కల్లో పూర్తి స్థాయిలో ఔషద గుణాలు ఉన్నాయని గమనించారు. అంతే వారు పెద్దల మన్నలను, సహకారాన్ని పొందారు. విజయనగరం జిల్లా కేంద్రంలో ఉన్న చాణుక్య హైస్కూల్‌లో చదువుతున్న వారి వయస్సు పట్టున 14 ఏళ్ళు లేవు. అయినా పట్టు విడవకుండా పిశోధనకు కొంత సమయాన్ని కేటాయించి సంయుక్తగా ఉంటూ సఖ్యతతో వారి పరిశోధనా సారాన్ని రాష్ట్రస్థాయి ఇండియన్ ఇన్నోవేషన్ అసోసియేషన్ నిర్వహించిన గ్లోబల్ యంగ్ సైంటిస్ట్ చాలెంజ్‌కు పంపించారు. గత ఏడాది నవంబర్‌లో ఒంగోలులో జరిగిన ఈ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించారు. అక్కడితో సంతృప్తి పడలేదు. ఇంకా ముందుకు వెళ్ళాలని లక్ష్యంతో గత ఏడాది గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగే జాతీయస్థాయి ఛాలెంజ్‌కు పంపారు. అక్కడ కూడా వారికి సిల్వర్ మెడల్ వచ్చింది. ఇక మా పయనం అటువైపేనని టీమ్ విజయభానుతో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో తెలిపారు. కలెక్టర్ విషయం తెలుసుకుని వారిని అభినందించి సిల్వర్ మెడల్ వేశారు. ఈ బృందంలో జి.మనోజ్ కుమార్ టీమ్ లీడర్ కాగా, వి.ప్రేమ్‌కుమార్, రోహన్ చరణ్, సిహెచ్.భరత్ కుమార్, ఆర్.గౌతం కిశోర్, లతో పాటు స్కూల్ ప్రిన్సిపల్‌డి.సత్యానందరావు, వైస్ ప్రిన్సిపల్ కె.కార్తీక్ పాల్గొన్నారు.

## ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా ఉష

రోలుగుంట : ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా ఎస్.ఉష విధుల్లో చేరారు. ఇప్పటి వరకూ నక్కపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో జూనియర్ టెక్నికల్ అధికారిగా పని చేస్తున్న ఆమెకు ఏఈగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు ఆమె చోడవరం డివిజనల్ ఇంజనీర్ ఎన్.భారతికి ఉత్తర్వులు అందజేసి రోలుగుంట ఏఈగా విధుల్లో చేరారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేస్తున్న ఏఈ జి.కరుణ రావికమతం మండలం బదిలీ అయ్యారు.

## సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ దరఖాస్తుల గడువు పెంపు

కొయ్యూరు : : పారామిలటరీ దళాల(సిఆర్‌పిఎఫ్, బిఎస్‌ఎఫ్, సిఐఎస్‌ఎఫ్) దరఖాస్తు గడువును ఈ నెల 30 వరకు పెంచినట్లు కొయ్యూరు ఎస్సై రుక్మాంగధరావు తెలిపారు. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలనే ఆసక్తి గల అభ్యర్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# అపజయాలు కలిగిన చోటే.. గెలుపు పిలుపు వినిపించింది




విజయనగరం: ఎన్నో అవమానలతో...ఎన్నో అపజయాలతో జీవితంలో పనికిరామనే భ్రమలో ...అపనమ్మకంతో వారు కాలం గడపలేదు. మనమూ అన్ని సాధించగలమనే నమ్మకంతో...సాధనని ఊపిరిగా చేసుకుని బతుకు మీద భరోసాతో తమకున్న శక్తిని నమ్ముకున్నారు. పేరుకు దివ్యాంగులే కానీ, వారు అన్ని ఆటల్లోనూ...క్రీడల్లోనూ రాణిస్తూ సరిహద్దులు దాటి విజయం వైపుకు దూసుకుపోతున్నారు. ఇది చూడడానికి వచ్చిన ప్రేక్షకులను...ఆశ్చర్యంలో ముంచెత్తారు. విజయనగరం కేంద్రంలో గత మూడురోజులుగా అనంతపురం కేంద్రంగా ఏర్పడిన నార్త్‌జోన్ క్రికెట్ టోరమెంట్ ఫర్ ఫిజికల్లీ ఛాలెంజ్ అసోసియేషన్ నాలుగు జిల్లాలకు చెందిన దివ్యాంగులకు జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ఆద్యాంతం ఆకట్టుకుంది. వారు శరీరంలో ఏదో ఒక భాగానికి వైకల్యం ఉన్నా ఆరోగ్యవంతంగా ...ఉత్సాహంగా ఆడారు. తూర్పుగోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళంకు చెందిన బృందాలు దీనిలో పాల్గొన్నాయి. సుమారు 60 మందిని రోజా క్రీడాపోటీల్లో ఈనెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరిగిన పోటీల్లో తమ ప్రతిభను చూపారు. గెలుపు ఓటమితో తేడాలేకుండా క్రీడాకారులంతా ఒక్కటై....కలిసి మిగతా క్రీడాకారులను ప్రోత్సహించడంతో వారిలో ఐక్యతని చాటిచెప్పించి. సుమారు ఎనిమిది టీమ్‌లు తలపడగా విశాఖ జట్టు టోర్నీని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో గ్రంథాలయ చైర్మన్ బొద్దుల నర్సింగరావు మాట్లాడుతూ గెలుపు, ఓటముల మధ్య సమన్వయాన్ని జీవితంలో నేర్పేదే క్రీడారంగమని అందులో దివ్యాంగుల ఆటతీరు చూస్తే ఇతర క్రీడాకారులు కూడా చాలా నేర్చుకోవల్సి ఉందని అన్నారు. డాక్టర్ కె.వేంకటేశ్వరరావు (ఆర్థోపిడెక్) మాట్లాడుతూ శారీరక శ్రమ వల్ల మనలో కొత్త ఉత్సాహం..ఆరోగ్యకర మార్పులు వచ్చి నూరేళ్ళు జీవించే సత్తా వస్తుందన్నారు. సభను నిర్వాహకులు మధుసూధనరావు నిర్వహించగా..జాతీయ క్రీడాకారురు అర్జునరెడ్డి కూడా ప్రసంగించారు

మొదటి పేజీ తరువాయి

## ప్రధాని మోదీకి శ్రుభాకాంక్షలు తెలిపిన పముఖులు

భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని.. దేశాన్ని సమున్నత శిఖరాలవైపు నడిపించేలా ఆయన మరిన్ని సంవత్సరాలు సేవచేయాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు.

గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్, నీతి ఆయోగ్ మాజీ వైస్ చైర్మన్ అరవింద్ పనగరియా, ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, తదితరులు కూడా ట్విటర్లో మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. కాగా మోదీ తన పార్లమెంటు నియోజకవర్గం వారణాసిలో 68వ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. మోదీ జన్మదినం సందర్భంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేతృత్వంలో సెప్టెంబర్ 17ను దేశవ్యాప్తంగా సేవా దివస్‌గా జరుపుకున్నారు. రక్తదాన శిబిరాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు సహా బీజేపీ నేతలు పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు.

**568 కిలోల లడ్డూ ఆవిష్కరణ :**

ప్రధాని నరేంద్ర మోదీ 68వ పుట్టినరోజు సందర్భంగా సోమవారం 568 కిలోల లడ్డూని ఆవిష్కరించారు కేంద్ర మంత్రులు ప్రకాశ్ జవదేకర్, ముక్తార్ అబ్బాస్ నఖ్వి. సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఇద్దరు మంత్రులు... ఈ భారీ లడ్డూను ఆవిష్కరించారు. ఈ సంస్థ ప్రధాని మోదీ పుట్టినరోజును స్వచ్ఛతా దివస్‌గా నిర్వహిస్తున్నది. పారిశుద్ధ్యం ఓ ఉద్యమంలా సాగిందని మరో కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వి అన్నారు.

## 11 మంది స్వామీజీల ఆశీస్సులతో.. రాహుల్ రణభేరి!

గట్టి పట్టుదల మీద ఉంది. ఇవాళ 15 కిలోమీటర్ల మేర రోడ్‌షో ప్రారంభించే ముందు రాహుల్ గాంధీ పలువురు మతాచార్యులను కలుసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీనియర్ నేతలతో కలిసి బస్సులో రోడ్‌షోకి బయల్దేరిన కాంగ్రెస్ చీఫ్‌ను చూసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు పోటీపడ్డారు. రోడ్డుపక్కన సమోసా తిని, టీ తాగేందుకు రాహుల్ కొద్దిసేపు ఆగడంతో... ఆయన అనుచరులు పెద్దఎత్తున సెల్ఫీలు దిగేందుకు అవకాశం దొరికింది. రోడ్ షో జరుగుతున్న మార్గంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలను చేయకపోవడం దురదృష్టకరం



విజయవాడ : దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలుండగా 17 రాష్ట్రాలు రజకులను ఎస్సీల్లో గుర్తించి నప్పటికి రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆ ప్రయత్నాలను ముమ్మరం చేయకపోవడం దురదృష్టకరమని ఆంధ్రప్రదేశ్ రజక సంఘం ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు చెప్పారు. దాచేపల్లి ఆర్ అండ్ బి బంగ్లా లో జరిగిన ప్రెస్మీట్లో వారు మాట్లాడుతూ రజకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు అంజిబాబు వివరించారు. రజకులకు కేటాయిం చిన చెరువు లు కబ్జా కు గురువుతున్నాయని,ఫలితంగా ఉపాధి కోల్పోయి ఆర్ధికంగా నష్టపోవాల్సి దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మధ్య రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆదరణ పథకంలోను రజకులకు ఆశించినంత న్యాయం జరగలేదని తెలిపారు.బీసీ ల్లోని వృత్తి దార్ల గౌడ,చేనేత,మత్స్యకారులకు 50 సంవత్సరాలు దాటితే పెన్షన్లు ఇస్తున్న విధానాన్ని రజకులకు కూడా అందచేయమని కోరారు.స్వశక్తి పై నిలవాలని ఆశిస్తున్న రజకులకు రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తున్న పరికరాలు కూడా నాసిరకంగా ఉన్నాయని విమర్శించారు.

రాజకీయంగా రజకులు ఎదగక పోవడంతో అన్ని రంగాల్లో నిరాదరణకు గు రవుతున్నారని ఆయన స్పష్టంచేశారు. రాష్ట వ్యాప్తంగా ఒక్క ఎమ్మెల్యే కూడా లేదని, ఒకే ఒక జడ్పీటీసీ స్థానంలో రజకులున్నారని భవిష్యత్తులో దామాషా ప్రకారం రజకులకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా ఎస్సి జాబితాలో రజకులను చేర్చి న పక్షంలో తాము కుల దూషణ ,భౌతిక దాడులు,చులకన భావం వంటి వాటి నుంచి బయటపడే అవకాశం ఉందని ప్రభుత్వానికి కోరారు.రాష్ట్రంలో ఇప్పుడున్న రాజకీయాల దృష్ట్యా ముఖ్యంగా 5 పార్టీలు పోటీపడు తున్నాయని,రాష్ట్రం విడిపోయాక ఎంత కాదన్న కుల సమీకరణాల మీద రాజకీయాలు నడుస్తున్నాయన్నారు. .ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక లీగల్ సెల్ అధ్యక్షులు కమ్మపాటి కోటేశ్వరావు, రాష్ట్ర కార్యదర్శి చేజర్ల సతీష్ జిల్లా కార్యదర్శి మక్కెన అమ్మర్ కృష్ణ, మాట్లాపూడి పూర్ణ,పలుగురి సీతారామయ్య, మైలాపూరి చిన్నా వెంకటేశ్వర్లు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# బాల సురక్ష సిబ్బందికి బకాయి జీతాలు వెంటనే ఇవ్వాలి



విశాఖపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బాల సురక్ష పథకంలో పనిచేస్తున్న డాక్టర్లు, ఎఎన్ఎంలు, ఇతర సిబ్బందికి 3 నెలల జీతాలను వెంటనే ఇవ్వాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు ఆధ్వర్యంలో నేడు కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించి జాయింట్ కలెక్టర్‌కు మోమోరాండం ఇవ్వడమైంది. 2014 నుండి కేంద్ర ప్రభుత్వ నిర్వహిస్తున్న "రాష్ట్రీయ బాల స్వశ్చత కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె)"లో భాగంగా మన రాష్ట్రంలో 2018లో ముఖ్యమంత్రి బాలసురక్ష అనే పేరుతో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్‌లో ధనుష్ ఇన్‌ఫోటెక్ ఏజెన్సీగా పెట్టి ఈ పథకాన్ని ప్రారంభించారు. 2018 జూన్ 21న ముఖ్యమంత్రి ప్రారంభించిన ఈ పథకం ద్వారా రాష్ట్రంలో ఉన్న బాలల ఆరోగ్య స్థితిపై అంగన్‌వాడీ, ప్రభుత్వ స్కూళ్లు, గ్రామాల్లో ఉన్న బాలలను స్క్రీనింగ్ పరీక్షలు చేసి వారి ఆరోగ్య పరిస్థితిపై జిల్లా ఆరోగ్య విభాగానికి రిపోర్టులు అందజేశారు. మెడికల్ సిబ్బంది జూన్ 21వ తేదీ నుండి పనిచేస్తున్నా నేటికీ వారికి ఇస్తామన్న జీతాలను ఇవ్వలేదు. సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేసి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు నేతృత్వంలో జాయింట్ కలెక్టర్ సృజనను కలిసి తమ సమస్యలను విన్నవించమైనది. దీనిపై జాయింట్ కలెక్టర్ స్పందించి దీనిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. రాష్ట్రంలో ఈ పథకాన్ని నిర్వహిస్తున్న 'ధనుష్ ఇన్‌ఫోటెక్' సంస్థగానీ, జిల్లా వైద్యాధుకారులు వీరితో పనిచేయించుకోవడమే గానీ జీతాలు ఇవ్వడంలో తమకు సంబంధం లేనట్లు వ్యవహరించడం దుర్మార్గం అన్నారు. వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బాల సురక్ష సిబ్బందితో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో వర్కింగ్ ఉమెన్ కోఆర్డినేషన్ కమిటీ ఎస్.అరుణ, డాక్టర్లు ఎంకెవి ప్రసాద్, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ జె.సూర్యనారాయణ, డాక్టర్ బి. వాసంతీ, ఎఎన్ఎంలు ఎన్ రమాదేవి, కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్ బిల్లులు చెల్లించాలని కలెక్టర్‌కు వినతి



*కలెక్టర్‌కు వినతిపత్రంఅందజేస్తున్న అప్పలరాజు*

నర్సీపట్నం : అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్ బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని అంగన్వాడి అసోసియేషన్ (ఏఐటియుసి) జిల్లా అధ్యక్షులు ఎం. అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టర్ ను తన ఛాంబర్‌లో కలిసి విషయాన్ని విశదీకరించారు. విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడం వలన చాలా కేంద్రాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం వలన చిన్నారులు, బాలింతలు, గర్భిణులు అసౌకర్యానికి గురవుతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం నుండి ఖచ్చితమైన ఆదేశాలు వచ్చేవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆయన కోరారు. ప్రత్యేక అధికారులకు సూచనలిచ్చి విద్యుత్ సరఫరా జరిగేలా చూస్తామని జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ హామీ ఇచ్చినట్లు అప్పలరాజు విలేఖర్లకు తెలిపారు.

# జగన్ పాదయాత్రలో వైఎస్సార్‌సీపీ

## 43వవార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీను



కంచరపాలెం : వైఎస్ జగన్ పాదయాత్ర సాగుతున్న మార్గంలో పండుగ వాతావరణం నెలకొంది. వైఎస్ జగన్ దారిపొడవునా ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పాదయాత్ర కొన సాగించారు. ఈ మేరకు విశాఖ ప్రాంతానికి చెందిన స్థానిక జీవీఎంసీ 43 వార్డ్ వైస్సార్సీపీ అధ్యక్షుడు ఆడారి శ్రీను వైస్సార్సీపీ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలసి పాదయాత్రలో పాల్గున్నారు.

రానున్న రోజుల్లో జగన్మోహన్రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, ప్రజాసంకల్ప యాత్ర విజయవంతం కావాలని ఈ సందర్భంగా ఆమె భగవంతుని కి కోరినట్లు ఆయన పేర్కొన్నారు. సుమారు 5 కిలోమీటర్లకు పైగా నడిచారు. పార్టీ పరంగా వార్డులో చేపడుతున్న కార్యక్రమాలపై జగన్ కు వివరించారు .

# అప్పన్నను దర్శించుకున్న పార్లమెంటరీ పే అండ్ అకౌంట్స్ కమిటీ సభ్యులు



సింహాచలం : శ్రీవరాహలక్ష్మీ నరసింహస్వామి వారిని పార్లమెంటరీ పే అండ్ అకౌంట్స్ నలుగురు ఎంపీ లు జనార్ధన్ సిగ్రివాల్, బరుతృహరి మహతాబ్ ,శివకుమార్ ఉదాసి ,కిరీట్ సోమయ్య మరియు శ్రీమతి సోమయ్య డైరెక్టర్ తో కూడిన కమిటీ సభ్యులు సోమవారం దర్శించుకున్నారు ముందుగా ఆలయ అధికారులు మరియు అర్చకస్వాములు వీరికి ఆలయ సాంప్రదాయము ప్రకారం స్వాగతం పలుకగా అంతరాలయంలో అర్చకస్వాములు ప్రత్యేక అర్చనలు జరపగా అనంతరం బృందం సభ్యులు కప్పస్తంబము ఆలింగనం అనంతర బేడా మండపంలో వైదికులు వేదాశీర్వచనం పలుకగా ఆలయ ఏ ఈ ఒ ఆర్ వీ ఎస్ ప్రసాద్ వీరికి స్వామివారి చిత్రపటం ప్రసాదం అందజేశారు



***ఆరిలోవ కాలనీ ఒకటో వార్డు నలభై గజాలు వద్ద ఈ రోజు ఘనంగా శ్రీ విశ్వకర్మ జయంతి వేడుకలు జరిగినయి ఆ కార్యక్రమనికి వీరబ్రహ్మం ఆలయ కమిటీ పెద్దలు . వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త సి హెచ్ శ్రీనివాస్( వంశీకృష్ణ ) ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. ఆయనకు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరిపించి ఇక్కడ జరిగిన అన్నసంతర్పణ కార్యక్రమంలో భక్తులకు ప్రసాదం వంశీ కృష్ణ చేతుల మీదుగా వడ్డింపు కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో స్టేట్ సేవాదల్ జనరల్ సెక్రెటరీ శ్రీసతీ మందారెడ్డి 1ó వార్డుఅధ్యక్షులు కల్లాసత్యనారాయణ సిటీ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బోని శివరామకృష్ణ .బాధా రాము భూశివరలక్ష్మి డాక్టర్ నాయుడు .మోహన్ అప్పలనాయుడు. ఆనంద్. నాని .తులసి .తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు ....***

# జివిఎంసి గ్రీవెన్సుకు 157 పిర్యాదులు



విశాఖపట్నం : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్సుడేలో మొత్తం 157 ఫిర్యాదులు అందాయి. చీఫ్ సిటిప్లానర్ విద్యుల్లత ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందిన మొత్తం 157 పిర్యాదులలో ప్రధాన కార్యాలయానికి సంబంధించి 44 ఫిర్యాదులు అందాయి. ఒకటవ జోన్ కు సంబంధించి 25, నాలుగవ జోన్‌కు సంబంధించి 7, ఐదవ జోన్‌కు సంబంధించి 73, ఆరవ జోన్‌కు సంబంధించి 8 ఫిర్యాదులందాయి. వీటిలో టౌన్‌ప్లానింగ్ విభాగంకు సంబంధించి 20, ప్రజారోగ్యవిభాగానికి సంబంధించి 14 , ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 66, అదనపు కమిషనర్(ఫైనాన్స్) విభాగానికి సంబంధించి ఒకటి, యుసిడి విభాగానికి సంబంధించి 3, హార్టికల్చర్ విభాగానికి సంబంధించి ఒకటి , డిప్యూటి కమిషనర్ రెవిన్యూ విభాగంకు 36, ఇతరులకు సంబంధించి 16 పిర్యాదులు అందాయి.

### డయల్ యువర్ కమిషనర్‌కు 13 ఫిర్యాదులు

విశాఖపట్నం :- జి.వి.యం.సి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ (నెంబరు 1800-4250-0009) కార్యక్రమానికి 13 ఫిర్యాదులు అందాయి. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి హాజరై పలువురి నుండి వచ్చిన ఫోన్ కాల్స్‌కు సమాధానం చెప్పారు. ఇందులో ఒకటవ జోన్‌కు సంబంధించి మూడు, రెండవ జోన్‌కు సంబంధించి రెండు, మూడవ జోన్‌కు సంబంధించి ఐదు, రెండవ జోన్‌కు సంబంధించి రెండు, మూడవ జోన్‌కు సంబంధించి రెండు, ఆరవజోన్‌కు సంబంధించి నాలుగు ఫిర్యాదులు అందాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి మూడురోజులులోగా నివేదిక సమర్పించాలని కోరారు.

# సముద్రాలను ప్లాస్టిక్ కాలుష్యానికి దూరంగా ఉంచండి

## గీతంలో జార్జియా వర్సిటీ శాస్త్రవేత్త సూచన



సాగర్‌నగర్ : ప్రమాదకరమైన ప్లాస్టిక్ వ్యర్థాలతో సముద్ర వాతావరణం కలుషితం కాకుండా చూడాలని తద్వారా మానవాలికి మేలు జరుగుతుందని జార్జియా విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ సర్క్యులర్ మెటీరియల్స్ మేనేజ్‌మెంట్ డైరక్టర్ జిన్నాజాంబెక్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ పర్యావరణ శాస్త్ర విభాగంలో సోమవారం తేది: 17-09-2018న జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా సముద్రాలలో 8.3 బిలియన్ మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు చేరుతున్నాయని ఇదే పరిస్థితి కొనసాగితే 2050నాటికి 34బిలియన్ మెట్రిక్ టన్నుల మేర ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగి పోతాయన్నారు.సముద్ర జలాలో ప్లాస్టిక్ కరిగిపోదని అయితే వాతావరణానికి, సూర్య రశ్మికి లోనై చిన్నచిన్న ముక్కలుగా వేరుపడి సాగరాలను కలుషితం చేస్తుందన్నారు. ఇప్పటికే పలు దేశాలలోని సముద్ర జలాలలో తిమింగలాలు, తాబేళ్ళు, మత్స సంపద పై అధ్యయనాలలో వాటి శరీర భాగాలలోకి ప్లాస్టిక్ చేరినట్లుగా గుర్తించారని తెలిపారు. మత్స్య సంపదను ఆహారంగా తీసుకునే ప్రజలకు ఇది ప్రాణాంతకంగా మారుతోందన్నారు. ఈ కారణంగా ప్లాస్టిక్ సంబంధమైన పధార్థాల స్థానంలో తిరిగి ఉపయోగించేందుకు వీలైన వాటర్ బాటిల్స్, స్ట్రాలు, సంచులు, ప్యాకింగ్ కవరులు వినియోగించాలన్నారు.వస్తువుల తయారీదశలోనే అవి తిరిగి వాడుకోనేలా డిజైనింగ్ ఉండాలన్నారు.

కార్యక్రమానికి పర్యావరణ శాస్త్ర వభాగం అధిపతి డాక్టర్ వై. మారుతి అధ్యక్షత వహించగా వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజగోపాల్ ముఖ్యఅతిధిని సన్మానించారు.

# సుగర్ ఫ్యాక్టరీ నిధులు అఖిలపక్షాల విజయం

అనకాపల్లి : తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీకి నిధులు మంజూరవ్వడం అఖిలపక్ష పార్టీల విజయమని కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు బోయిన బానుమూర్తి అన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, వైఎస్‌ఆర్ కాంగ్రెస్, బిఎస్పీ, జనసేన, ప్రజాసంఘాలు ఉత్తరాంధ్ర చర్చావేదిక, విశాఖ రైతు సమాఖ్య వంటి సంస్థలు సమాఖ్యంగా ఉద్యమించడం వలన ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రజా ఉద్యమాలకు తెలుగుదేశంపార్టీ తలొగ్గి గత్యంతరం లేని పరిస్థితుల్లో నిధులు మంజూరు చేసారన్నారు. తమ ఘనతగా తెలుగుదేశంపార్టీ నేతలు పేర్కొనడం విచిత్రంగా ఉందన్నారు. నిధులు పక్కతోవ పట్టకుండా సక్రమంగా వినియోగించి ఫ్యాక్టరీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల, ఉద్యోగుల ఆకలిచావులు అరికట్టాలన్నారు. వెలుగుల బాబూరావు, యగ్గాడ భాస్కరరావు, తుట్టా రమణ, గుణబాబు, తదితరులు పాల్గొన్నారు.



# మీకోసం దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

## రెవిన్యూ డివిజనల్ అధికారి వి.విశ్వేశ్వరరావు



నర్సీపట్నం : మీ కోసం కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులు, ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని రెవిన్యూ డివిజనల్ అధికారి వి.విశ్వేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమం లో ఆయన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కోటవురట్ల మండలం లింగాపురం గ్రామానికి చెందిన కిలపర్తి కరుణ తన తండ్రి మరణించినందున ఆయన నిర్వహించే రేషన్ షాపు ను తనకు కేటాయించవలసిందిగా కోరుతూ దరఖాస్తు సమర్పించారు.

గొలుగొండ మండలం చీడిగుమ్మల శివారు పోలవరం గ్రామంలో తాము సాగు చేసుకుంటున్న భూమిని రికార్డులలో తమ పేరున నమోదు చేయవలసిందిగా గజ్జల రాజబాబు అతని సోదరులు దరఖాస్తు చేసుకున్నారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించవలసినదిగా కోరుతూ డీలర్ల సంక్షేమ సంఘం ఆర్డీవోకు దరఖాస్తులు సమర్పించారు. తాము సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పట్టాలను కల్పించవల సిందిగా కోరుతూ అనేకమంది ఆర్డీవోకు విన్నవించుకున్నారు. కోటవురట్ల గ్రామంలో సీతారాంనగర్ లో నివాసముంటున్న 150 కుటుంబాలవారు తాము ఎన్నో సంవత్సరాలుగా ఇల్లు కట్టుకుని ఉంటున్నామని, ఈ స్థలాలు కోదండరామస్వామి దేవస్థానానికి చెందినవని అధికారులు అంటున్నారని, తమకు తగిన న్యాయం చేయాల్సిందిగా కోరుతూ దరఖాస్తు సమర్పించుకున్నారు.

# జర్నలిస్టుల సహకారం మరువలేనిది

## టీఎస్సార్‌ను ఘనంగా సత్కరించిన వి.జె.ఎఫ్. బృందం



విశాఖపట్నం : విశాఖ అభివృద్ధిలో జర్నలిస్టుల సహకారం మరువలేనిదని రాజ్యసభ సభ్యుడు టి. సుబ్బరామిరెడ్డి కొనియాడారు. సోమవారం టీఎస్సార్ జన్మదినోత్సవం సందర్భంగా వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్ష, కార్యదర్శులు గంట్ల శ్రీనుబాబు, సోడిశెట్టి దుర్గారావుల నేతృత్వంలో పాలకవర్గసభ్యులు సుబ్బ రామిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీఎస్సార్ మాట్లాడుతూ 40 ఏళ్లుగా విశాఖ అభివృద్ధికోసం పాటుపడుతున్న తనకు ఇక్కడ జర్నలిస్టులు, మీడియా మిత్రులు ఎంతగానో సహకారం అందించారన్నారు. ఇదే సమయంలో జర్నలిస్టులకు ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీ తరపున అండగా వుంటామన్నారు. తనవంతు సహకారం ఎప్పుడూ వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కందుల నాగరాజు, ఉపాధ్యక్షులు ఆర్. నాగరాజు పట్నాయక్, జాయింట్ సెక్రటరీ దాడి రవికుమార్, కార్యవర్గసభ్యులు ఎం.ఎస్.ఆర్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రణయ్ దారుణహత్యకు నిరసనగా ఏయూలో మహా పరివర్తన ర్యాలీ



విశాఖపట్నం : ప్రణయ్ దారుణహత్యకు నిరసనగా ఆంధ్రాయూనివర్శిటీలో మహా పరివర్తన ర్యాలి జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రాయూనివర్శిటీ ఎస్.సి., ఎస్.టి., బి.సి.సి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షులు డా॥టి.షారోన్‌రాజు మాట్లాడుతూ యీ దేశంలో దళితులపై దాడులు, మారణ కాండలు, పరువు హత్యలూ రోజురోజుకీ విపరీతంగా పెరిగి పోయాయని వీటిని అరికట్టి దళితుల సమగ్రతకు ప్రభుత్వాలు తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, మిర్యాలగూడలో ప్రణయ్ హత్యలో ప్రధాన పాత్ర పోషించిన మారుతీరావు, శ్రవణ్‌లను చట్టపరంగా తక్షణమే ఉరి తీసి దళితుల రక్షణకు కృషిచేయాలన్నారు. ఆంధ్రాయూనివర్శిటీ ఎస్.సి., ఎస్.టి. నాన్‌టీచింగ్ అసోషియేషన్ అధ్యక్షులు ఎమ్.ఎస్.రవిరాజుగారు మాట్లాడుతూ దళితులకు రక్షణ కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. విద్యార్థి నాయకుడు ఆరేటి మహేష్ మాట్లాడుతూ కులాంతర వివాహాలు సమ సమాజ స్థాపనకు నాంది పలుకుతాయని అందుకే వాటిని స్వాగతించి వారిపై దాడులు జరగకుండా అరికట్టాలని అన్నారు. ఆచార్య కె.జాన్ మాట్లాడుతూ నిర్భయ చట్టంలాగే దళితులకు 'ప్రణయ్' చట్టాన్ని తీసుకొచ్చి వారి రక్షణకు తగిన రక్షణ చర్యలు చేపట్టాలని ఆకాంక్షించారు.


కెనరా బ్యాంక్ | ఆదర్శనగర్ బ్రాంచ్

**బంగారు నగల వేలము ప్రకటన**

[illegible]

తేది.17-09-2018, ప్రదేశం: విశాఖపట్నం | సం/- అధీకృత అధికారి

విజయభాను

## సంపాదకీయం

## సామాన్యులను దృష్టిలో పెట్టుకోవాలి

పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరుగుతుండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల్లో కలవరం చెలరేగుతున్నది. డాలర్‌తో రూపాయి విలువ తగ్గడం, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర పెరుగడం ఇందుకు ప్రధాన కారణాలు. పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరుగడానికి అంతర్జాతీయ కారణాలు ఉండవచ్చు. కానీ వీటి ధరలు ఆకాశాన్నంటుతున్నా, ప్రభుత్వం తమకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తున్నది. పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరుగడం వల్ల సామాన్యులకే భారం కాదు. ఆ ప్రభావం మొత్తం ఆర్థిక వ్యవస్థపైనే ఉంటుంది. 2013-14 నుంచి పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ఎక్సైజ్ సుంకం భారీగా పెరిగింది. నాలుగేండ్లలో ఎక్సైజ్ సుంకం లీటర్ పెట్రోల్‌కు 9.48 నుంచి 21.48 రూపాయలు పెరిగింది. డీజిల్‌పై సుంకం 3.56 నుంచి 15.33 రూపాయలు పెరిగింది. పెట్రోల్ ధరలో దాదాపు సగం పన్ను ఉంటున్నది. రూపాయి పరిస్థితి ఎప్పుడు బాగుపడుతుందో తెలువదు. ఇరాన్‌పై అమెరికా ఆంక్షల నేపథ్యం అంతర్జాతీయ పరిస్థితి మన చేతిలో లేదు. అందువల్ల ప్రభుత్వమే తన పరిధిలో సామాన్యులకు ఊరట కలిగించడానికి ప్రయత్నించాలె. పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరుగడానికి అంతర్జాతీయ కారణాలున్నాయి. అయితే చైనా, పాకిస్థాన్, శ్రీలంక, నేపాల్ వంటి ఇరుగు పొరుగు దేశాలకు, వర్ధమాన ఆర్థిక వ్యవస్థలకు కూడా ఇదేరీతిలో అంతర్జాతీయ కారణాలు వర్తిసాయి. అయినా అక్కడ మన దేశంలో మాదిరిగా భారీ ధరలు లేవు. మన దేశంలో కన్నా చాలా తక్కువ ధరకు పెట్రోల్, డీజిల్ ధరలు లభిస్తున్నాయి. పాకిస్థాన్‌లో ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెట్రోలియం ఉత్పత్తుల ధరలు ఇంకా తగ్గిస్తామని ప్రకటించింది. ఇంధన ధరలు ఇంతగా పెరుగుతున్నప్పటికీ, ప్రభుత్వం పన్నుల తగ్గింపు ద్వారా సామాన్యులకు ఉపశమనం కలిగించడానికి సిద్ధంగా లేదు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడం కూడా లేదని సంకేతాలు అందుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలపై పన్నులు తగ్గించడం అసాధ్యమనే వాదన ప్రభుత్వ మద్దతుదారుల నుంచి వినబడుతున్నది. దీన్ని వారు సమర్థించుకుంటున్న తీరు గమనార్హమైనది. పెట్రోలియం ఉత్పత్తులపై ఒక రూపాయి పన్ను తగ్గిస్తే, మొత్తంగా పదమూడు వేల కోట్ల రూపాయల మేర ఆదాయం తగ్గుతుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. పెట్రోలియం ఉత్పత్తులపై పన్నులు తగ్గిస్తే, సంక్షేమ పథకాలకు కోత వేయవలసి వస్తుందని అంటున్నారు. కానీ ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత కొన్ని లక్షల కోట్ల రూపాయల మేర పరిశ్రమలకు పన్నుల రాయితీలను ఆయా ప్రభుత్వాలు ఇచ్చాయి. కొన్ని పారిశ్రామిక సంస్థలకు లబ్ధి సమకూర్చడానికి ప్రభుత్వం ఇంతగా తన ఆదాయానికి కోత వేసుకోవడానికి సిద్ధపడినప్పుడు, సామాన్యులతో సహా సమాజమంతటికీ లబ్ధి చేకూరే చర్యలు తీసుకోవడానికి సంకోచం ఎందుకు? ఆ లోటు పూడ్చడానికి కోట్లాది మందిని ఆదుకునే సంక్షేమ పథకాలకు కోత వేయమని ఎవరూ చెప్పరు. ఆ లోటును పూడ్చుకోవడానికి ఇతర మార్గాలు అన్వేషించాలె. ఇంధన ధరలు పెరుగడం వల్ల పడే ఇబ్బందుల నుంచి మధ్యతరగతి, సామాన్య ప్రజలు బయట పడటం కష్టంగా మారింది. ఇందుకు కారణం కూడా పాలకులు అనుసరిస్తున్న విధానా లే. ప్రభుత్వ అభివృద్ధి విధానాలు నగరాల విస్తరణకు, ప్రైవేట్ రవాణాకు అనుకూలంగా ఉన్నది. దీనివల్ల బతుకుదెరువు కోసం తెల్లారితే దూర ప్రాంతాలకు వెళ్ళక తప్పదు. ప్రభుత్వ రవాణా క్రమంగా కుంచించుకుపోతున్నది. రవాణా రంగాన్ని ప్రైవేటీకరించే పోకడ చాలాకాలంగా సాగుతున్నది. దీనివల్ల పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినప్పుడల్లా సామాన్యులు విలవిలలాడిపోతున్నారు. ఒకప్పుడు ఎక్కడి అవసరాలు అక్కడే స్థానికంగా తీరేవి. ఇప్పుడు నిత్యావసర వస్తువులు మొదలుకొని అనేకం ఇతర ప్రాంతాల నుంచి లేదా ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతుంటాయి. ఆహార పదార్థాలు స్థానికంగా దొరికినవే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నాయి. ఆర్థికవ్యవస్థ నిర్మాణమే ఈ విధంగా మారిపోయింది. ఈ కారణంగా ఇంధన ధరలు పెరిగినప్పుడల్లా రవాణా భారమై ఆ ప్రభావం అన్ని వస్తువుల ధరలపై పడుతుంది. ఒకప్పుడు కార్ల వంటి వాహనాలు ధనికులకే పరిమితమై ఉండేవి. దేశంలో నగర ప్రాంతాలు తక్కువ. గ్రామాల్లో బస్సు ఎక్కి ప్రయాణించడం చాలా తక్కువ మంది అనుభవం. సమీప గ్రామాలకు ఎడ్ల బండి లేదా కాలి నడక ద్వారా వెళ్ళేవారు. అంతకుమించి వెళ్ళే అవసరం చాలామందికి ఉండకపోయేది. ఆ కాలంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే అది ప్రజల సమస్యగా ఉండకపోయేది. కానీ ఇప్పుడు సామాన్యులను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవడం అవసరం.

# అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడనివోద్దు

- మండల వ్యాప్తంగా సిసి రహదారులు మురుగు కాలువల నిర్మాణం పనులు
- గుత్తేదారుల చే నాణ్యమైన పనులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి
- కొండపల్లి మరో మినీ ఇండియా - రూ.186.90 కోట్లతో ఇంటింటికీ కుళాయి

ఏపీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



ఇబ్రహీంపట్నం : గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న నిర్వహణ పూర్తి నాణ్యతగా ఉండేటట్లు చూడాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులదేనని మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం నాడు కొండపల్లి శ్రామిక నగర్ ప్రాంతంలో నిర్మాణం సిసి రహదారుల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా రహదారులు, మురుగు కాలువల ఏర్పాటు జరగనుందన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పనులు పూర్తి కాగా, మరికొన్ని ప్రాంతాల్లో ప్రారంభమయ్యాయన్నారు. పనులు నిర్వహించే చోట్ల స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పనులను పర్యవేక్షించి నాణ్యమైన వాటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యమంత్రి యువ నేస్తం కు యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు ఆధారంగా అర్హులా, కాదా అన్న విషయం రూఢి అయిన తర్వాత ఆన్ లైన్ వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంతో పాటు జిల్లాలో అన్ని చోట్ల జలసిరికి హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కొండపల్లి మరో మినీ ఇండియా అని ఈ సందర్భంగా మంత్రి ఉమా అన్నారు. రోయి.186.90 కోట్లతో నియోజకవర్గంలో ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# కంచరపాలెం బహిరంగ సభ అందరి విజయం

మల్ల విజయప్రసాద్



కంచరపాలెం : ప్రజా సంకల్పయాత్ర లో బాగంగా ఈ నెల 9వ తేదీన కంచరపాలెం మెట్టుపై జరిగిన భారీ బహిరంగసభ విజయవంతం చెయ్యడంలోఅందరూ సమిష్టిగా కలసి చేశారని వైఎస్ఆర్సిపి నగర అధ్యక్షుడు మల్ల విజయప్రసాద్ పేర్కొన్నారు .ఈ మేరకు బిర్లా జంక్షన్ మురళీనగర్ ఓ ఫంక్షన్ హాల్ లో వార్డు అధ్యక్షులతో ఆత్మీయ అభినందన సమావేశం సోమవారం నిర్వహించారు. వైఎస్సార్సీపి పార్టీ అధినేత జగన్మోహన్రెడ్డి ఇప్పటివరకు చేసిన ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా కనీవిని ఎరిగిన రీతిలో కంచరపాలెం బహిరంగ సభ ఒక నిదర్శనమని ఈ బహిరంగ సభలో ఊహించిన దానికంటే అధికంగా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి జగన్ యొక్క ఉత్కంఠ పూరితమైన ప్రసంగాన్ని విన్నారని ఇదే రీతిలో ప్రతి కార్యకర్త ప్రజల వద్దకు వెళ్లి పార్టీ ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలను ప్రతి ఓటర్లలోకి దూసుకెళ్లే విధంగా ప్రచారాన్ని చేసే విధంగా పని చేయాలని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు .రానున్న రోజుల్లో భవిష్యత్ ను ఉద్దేశించి కుని ప్రతి ఒక్క కార్యకర్త తమవంతు బాధ్యతగా తీసుకుని కార్యకర్త జగన్మోహన్రెడ్డి సిఎం చేసినంత వరకు కృషి చేయాలనీ, అదే విధముగా పార్టీ బాధ్యతను తమ భుజస్కందాలపై వేసుకొని ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. తదనంతరం

తమ వంతు కృషి చేసిన ఉత్తర నియోజకవర్గ 11,12,34,35,36,37,38,39,40,41 వార్డుల కుటుంబ వారిని విరివిగా పిలిచి వారిని ప్రత్యేకంగా అభినందించారు .ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం సమన్వయ కర్త కె కె రాజు మాజీ ఎం ఎల్ ఏ తయినాల విజయ్ కుమార్ వార్డు అధ్యక్షులు చల్లా ఈశ్వరావు , సనపల చంద్ర మౌళి , గోవిందరావు బాబా పైడిరామన శ్రీనివాసరావు ,సతీష్ , రత్నాకర్ జుబేర్ , బొడ్డేటి నాగు రొంగలి జగన్నాధం గుజ్జు వెంకటరెడ్డి ,షేక్ బాబ్జి ,హరిపట్నాయక్, రొయ్య వెంకటరమణ ,

మరియు అనుబంధ సంఘాల మహిళలు స్థానిక అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

# అన్నసమారాధన ప్రారంభించిన సురేంద్ర

అనకాపల్లి : పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో గల మళ్ల సురేంద్ర నివాసం వద్ద, సోమవారం అన్నసమారాధన బారీగా నిర్వహించారు. ఈ అన్నసమారాధన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో బాగంగా పోతురాజు సిండికేట్ ఆద్వర్యంలో నిర్వహించిన ఈ అన్నసమారాధనను మళ్ల సురేంద్ర ప్రారం భించారు. సుమారు 2వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరిం చారు. ఈకార్యక్రమంలో మళ్ల రాంబుజ్జి, స్దానిక యువకులు పెద్దలు, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## కవి సమయం

## పరిశుభ్ర ధరిత్రి

ఆరోగ్యమే మహా భాగ్యం అన్నది ఆర్యోక్తి
బలవర్ధక ఆహారం చక్కని పరిసరాలు చల్లని గాలి ,
కల్మాష రహిత మనస్సు ఆరోగ్య హేతువు
శుచి శుభ్రత దైనందిన జీవితం లో అవసరాలు
పరిశుభ్రత నెలకొన్న చోత దైవత్వం వెల్లివిరుస్తుంది
మనసుకు పట్టిన మకిలి ,సంకుచితత్వం ప్రక్షళనతో
కాలుష్య రహిత సమాజం సాధ్యం
పరిశుభ్రమైన ఈల్లు లక్ష్మీదేవికి ఆవాసం
స్వచ్ఛత సాధనయే మన లక్ష్యం కావాలి
పంచ భూతాల్లో ఒకతైన ధరిత్రి
మన ఉనికికి ఆధారం
పవిత్ర భూమిని పరిషుద్ధం గా
తీర్చిదిద్దదమే మనందరి నైతిక బాధ్యత, కర్తవ్యం

కవిత రచన :
సి . ప్రతాప్
సెల్ నెం : 90636 22665

## పంచాంగం

మాసం : భాద్రపద తిథి : నవమి రా.8.50; మూల ఉ.9.46; ఉ.వ.8.02ల 9.45; రా.వ.8.17ల 10.02.

మంగళవారం 18-09 -2018

**మేషం** : ప్రముఖుల సహాయంతో ఒక సమస్య నుంచి క్షేమంగా బయట పడతారు. ఖర్చులు, చెల్లింపులు ప్రయోజనకరంగా ఉంటాయి. ఇతరుల విషయా లకు దూరంగా ఉండటం క్షేమదాయకం. రుణం ఏ కొంతైనా తీర్చాలన్న మీ సంకల్పం నెరవేరుతుంది. స్త్రీలు గృహాలంకరణ, విలాస వస్తువుల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. **వృషభం** :పారిశ్రామిక రంగాల వారికి కార్మికులతో సత్సంబంధాలు నెలకొంటాయి. క్యాటరింగ్ పనివారలు, చేతివృత్తుల వారికి ఆశాజనకం. తరచూ వేడుకలు, శుభకార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. ఖర్చులు, చెల్లింపుల్లో ఏకాగ్రత వహించండి. విద్యార్థుల్లో ఏకాగ్రత, పట్టుదల చోటు చేసుకుంటాయి. **మిథునం** : మీ యత్నాలు కొంత ఆలస్యంగానైనా పరిపూర్ణంగా పూర్తవుతాయి. నూతన పెట్టుబడులు, వ్యాపారాలకు అనుకూలం. చేపట్టిన పనుల్లో శ్రమాధిక్యత, ప్రయోసలు ఎదుర్కొంటారు. స్త్రీలకు బంధువుల వైఖరి నిరుత్సాహం కలిగిస్తుంది. అవివాహితులు శుభవార్తలు అందుకుంటారు. బంధువులతో మనస్పర్థలు తలెత్తుతాయి. **కర్కాటకం** : వస్త్ర, బంగారం, వెండి, ఫ్యాన్సీ వ్యాపారులకు పురోభివృద్ధి. మిత్రుల సహకారంతో కొత్త యత్నాలు మొదలెడతారు. ఆధ్యాత్మిక విషయాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉద్యోగస్తులు పై అధికారులను మెప్పిస్తారు. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు అనుకూలిస్తాయి. స్పెక్యులేషన్ రంగాల వారికి నిరుత్సాహం తప్పదు. **సింహం** :నిరుద్యోగులు, చేతి వృత్తుల వారికి ఆశాజనకం. వేడుకలు, శుభకార్యాల్లో అందరినీ ఆకట్టుకుంటారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. భాగస్వామిక చర్చల్లో కొత్త విషయాలు చోటు చేసుకుంటాయి. పారిశ్రామిక రంగాల వారికి ఊహించని చికాకులు ఎదురవుతాయి. ఆర్థిక లావాదేవీలు సామాన్యంగా ఉంటాయి. **కన్య** :ఆత్మీయుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. వ్యాపారాలకు కొత్త కొత్త పథకాలు, ప్రణాళికలు రూపొందిస్తారు. దంపతుల మధ్య పలు ఆలోచనలు చోటు చేసుకుంటాయి. ధన వ్యయంలో ఏకాగ్రత వహించండి. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. ఎదురు చూడకుండానే మీకు కొత్త అవకాశాలు లభిస్తాయి. **తుల** : ఖర్చులు, చెల్లింపుల్లో ఏకాగ్రత వహించండి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచివి కాదని గమనించండి. వస్త్ర, ఫ్యాన్సీ, మందులు, రసాయన సుగంధ ద్రవ్య వ్యాపారులకు పురోభివృద్ధి. కోర్టు వ్యవహారాలలో ప్లీడరు, ప్లీడరు గుమస్తాలకు ఊహించని చికాకులు ఎదురవుతాయి. ఖర్చులు అధికమవుతాయి. **వృశ్చికం** :ఆలయాలను సందర్శిస్తారు. బంధువులతో తెగిపోయిన సంబంధాలు బలపడతాయి. ఆత్మీయుల కలయిక సంతోషం కలిగిస్తుంది. వ్యాపారాభివృద్ధికై చేయు కృషిలో రాణిస్తారు. రావలసిన ధనం అందటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉం టాయి. మీ కార్యక్రమాలు, పనులు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. **ధనుస్సు** :వ్యాపారాల విస్తరణలు, పరిశ్రమల స్థాపనలకు కావలసిన అనుమతులు మంజూరు కాగలవు. ఒక వ్యవహారం నిమిత్తం న్యాయవాదులతో సంప్రదింపులు జరుపుతారు. గృహంలో ఒక శుభకార్యానికి అనువైన పరిస్థితులు నెలకొంటాయి. మీ విలువైన వస్తువులు, పత్రాల విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. **మకరం** :స్త్రీలకు బంధువుల రాక వల్ల ఒత్తిడి, పనిభారం అధికమవుతాయి. పత్రిక, ప్రైవేటు సంస్థల్లోని వారికి యాజమాన్యం తీరు ఆందోళన కలిగిస్తుంది. చేతివృత్తులు, క్యాటరింగ్ పనివారలకు సదవకాశాలు లభిస్తాయి. ఏజెన్సీ, నూతన కాంట్రాక్టుల విషయంలో పునరాలోచన అవసరం. గృహ నిర్మాణాలు, మరమ్మతులు అనుకూలిస్తాయి. **కుంభం** :తలచిన పనుల్లో జయం లాంటి శుభ సూచకాలున్నాయి. ఎంత ధనం వెచ్చించినా కోరుకున్న వస్తువు దక్కించుకుంటారు. స్త్రీలకు నూతన పరిచయాలు, చుట్టుప్రక్కల వారి నుంచి ఆహ్వానాలు అందుతాయి. హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండటం మంచిది. ఒక వ్యవహారం అనుకోకుండా మీకు అనుకూలిస్తుంది. **మీనం** :ఆడిటర్లు, అకౌంట్స్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికం. నిరు ద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు.

# స్వచ్ఛతయే లక్ష్యం: జిల్లా కలెక్టర్



విజయనగరం: జిల్లాలో అన్ని గ్రామాల్లో స్వచ్ఛతయే సేవ కార్యక్రమాన్ని ఈ నెలాఖరులోగా విధిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.యం.హరిజవహర్‌లాల్ అన్నారు. సోమవారం కలక్టర్ ఆడిటోరియంలో స్వచ్ఛతయే పోష్టర్లు, ప్లెడ్జీలను ఆయన ఆవిష్కరించారు. ఈ నెలాఖరు వరకు ప్రతిరోజు నిర్ణయించిన కార్యక్రమాలను విధిగా చేపట్టాలని, శ్రమదానం చేయుటం, వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత, ఘన, ద్రవ, వ్యర్థ పదార్థాలు నిర్వహణ, ర్యాలీలు, ముఖ్యకూడళ్ళు శుభ్రపర్చటం, కార్పరేట్ సంస్థలు, కంపెనీల భాగస్వామ్యంతో నిర్వహించాలన్నారు. 100 మందిని స్వచ్ఛగ్రహిలు చైతన్యపర్చడం, నీలి వనరులు శుభ్రం చేయడం సామాహిక చర్చలు, శానిటేషన్ డ్రైవ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, సంయుక్త కలక్టేర్-2 జె.సీతారామారావు, డిఆర్ఓ జె.వెంకటరావు, జెడ్పీ సి.ఇ.ఓ వెంకటేశ్వరరావు గ్రామీణ నీటి సరఫరా ఎస్.ఇ. ఎన్.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌కు ఆధునిక వైద్యం

విశాఖపట్నం: స్త్రీలలో వచ్చే రకరకాల క్యాన్సర్లకు అత్యాధునిక చికిత్సా విధానాలపై అందరూ అవగాహన పెంచుకోవాలని ప్రముఖ గైనకాలజీ వైద్యులు డాక్టర్ రామకృష్ణంరాజు అన్నారు. మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రి, గైనకాలజీ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గైనకాలజీ క్యాన్సర్లపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామకృష్ణంరాజు ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతిని వెలిగించారు. ఈ కార్యక్రమంలో మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రి ఎండి. డాక్టర్ వి.మురళీకృష్ణ, డా.శశిప్రభ, విజయనగరం, విశాఖ పట్నం, శ్రీకాకుళం ప్రసూతి వైద్యులు పాల్గొన్నారు.

# 200 మందికి హోమియో వైద్య సేవలు

భీమునిపట్నం : స్థానిక చిన్నబజార్, డచ్ రోడ్డు వద్ద కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆద్వర్యం లో ఉచిత హోమియో వైద్య శిబిరం సుమారు 200 మంది కి ఉచిత పరిక్షలు నిర్వహించారు. కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ చంద్రమూర్తి చెప్పారు. ఈ శిభిరం లో హోమియో వైద్యులు మోహన్ రావు, జగన్నాదరావు లు వైద్య సేవలు అందించి ఉచితం గా మందులు పంపిణి చేశారు. ఇందులో పౌండేషన్ డైరెక్టరులు కలిగొట్ల. శ్రీనివాసరావు, కలిగొట్ల.బానోజిరావు, సిబ్బంది నాగిరెడ్డి ప్రసాదరావు ,శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# కేరళ బాధితులకు పలువురు ఆర్థిక సాయం



విజయనగరం: కేరళలో సంభవించిన ప్రకృతి వైపరీత్యం బాధితులకు 4 లక్షల రూపాయల చెక్కును కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి శాసన మండలి సభ్యులు కోలగట్ల వీరబధ్రస్వామి జిల్లా కలెక్టర్ ఎం.హరి జవహర్‌లాల్‌కు సోమవారం కలక్టర్ ఆడిటోరియం భవనంలో అందించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు లక్ష రూపాయల చెక్కు, చాణుక్య స్కూల్ ఉపాధ్యాయ, విద్యార్థులు లక్ష 58 వేల 788 రూపాయల చెక్కును దత్తిరాజేరు మండలం మరడాం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు 20వేల రూపాయలు చెక్కుకూడా కలెక్టర్‌కు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎవెల్‌సి కోలగట్ల వీరబధ్రస్వామి, ప్రజాప్రతినిధులుడిఎంహెచ్ఓ డా.కె.విజయలక్ష్మి, డి.ఇ.ఓ జి.నాగమణి, చాణుక్య స్కూల్ ప్రిన్సిపల్ డి.సత్యానందరావు, వైస్ ప్రిన్సిపల్ కె.కార్తీక్ విద్యార్థులు అక్షయ, నిఖిత, జ్యోత్స్నవిజయేంద్ర, ప్రేమ్‌కుమార్ మరడాం హైస్కల్ ఎవిద్యార్థులు పాల్గొన్నారు.

# కర్నూలులో జరిగే కాంగ్రెస్ సభను విజయవంతం చేయాలి

భీమునిపట్నం : కర్నూల లో నేడు కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్రమాని. రామానాయుడు కోరారు. పార్టీ ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణ రావు అధ్యక్షతన స్థానిక పార్టీ ఆఫీసులో విలేఖరుల సమావేశం నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కర్నూలు సభకు రాహుల్ గాంధీ విచ్చేస్తు నందున పార్టీ నాయుకులు, కార్యకర్తలు బహిరంగ సభకు అదిక సంఖ్య లో రావాలని కోరారు. ఈ సమావేశంలో నమో నారాయనమ్మ, తెడ్డు. రామదాస్, కదిరి జగన్నాదం , పాసి శ్రీను, మధు తదితరులు పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

## పేద విద్యార్థుల పట్ల దాతృత్వాన్ని చాటుకున్న 'సిటీ రిజర్వ్ పోలీస్' ఎం.వి.రమణ

విశాఖపట్నం : విశాఖ పోలీస్ కమిషనర్ ఆధీనంలో పని చేయుచున్న 'సిటీ రిజర్వ్ పోలీస్' ఎం.వి.రమణ పేద విద్యార్థుల పట్ల ఆయన దాతృత్వాన్ని చాటుకున్నారు. వారి చిన్నతంలో వారు పొందిన కష్టాలను బట్టి మరియు వారు గమనించిన పేద విద్యార్థులు పరిస్థితిని బట్టి కనీసం పరీక్ష ఫీజు కూడా కట్టలేని ఎంతోమంది విద్యార్థులను విద్యకు దూరమైన విద్యార్థులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. కావున నగరంలో అనేకమంది పేద విద్యార్థులు చదువుచున్నట్టి డా.వివిఎస్.కృష్ణా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు వచ్చి తన వంతు సాయంగా రూ.10,000/-లు (పదివేలు రూపాయలు) అందించి, ఈ సం॥ పరీక్ష ఫీజులు కట్టే సమయంలో ఫీజు కట్టలేని విద్యార్థులను గుర్తించి, వారిలో కొంతమందికి తానిచ్చిన డబ్బులో కొంతమందికి ఫీజును కట్టవలసిందిగా కోరుచూ ప్రిన్సిపాల్ వారికి ఆ మొత్తంను ఇవ్వడమైనది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస రావు మాట్లాడుతూ మానవత్వం కరువైపోతున్న ఈ రోజుల్లో వెంకటరమణ దాతృత్వాన్ని కొనియాడి ఆయన మరిన్ని సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని సేవలందించాలని ఈ సందర్భంగా కోరారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'ఓజోన్ పరిరక్షణ దినోత్సవం'



విశాఖపట్నం: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం 'ఓజోన్ పరిరక్షణ దినోత్సవం'ను జరిపారు. రసాయన శాస్త్ర విభాగము నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.శోభారాణి అధ్యక్షత వహించారు. ఓజోన్ పరిరక్షణకై విద్యార్థినులు తమ వంతు కృషి చేయాలని, పర్యావరణాన్ని కాపాడాలని వక్తలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ఆసక్తిగా పాల్గొన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లు, విద్యార్థినులు ప్రదర్శించిన పోస్టర్ ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి సిహెచ్.ఎస్.అనూరాధ, ఎస్.దుర్గాభవాని, డా.పి.వి.రమణారెడ్డి, ఎస్‌విఎస్.ప్రసాద్, ఆర్.మంజుల, హేమాం జలి, ఆర్.కిరణ్మయి, కె.గీతాంజలి, శాంతిదేవి, హరిత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్**



విశాఖపట్నం: పెదగంట్యాడ గ్రామంలోని చాకలివీధిలో సంభవించిన డెంగ్యూ వ్యాధి తగ్గిన వ్యక్తులతో జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా.ఎస్.తిరు పతి రావు, అసిస్టెంట్ మున్సిపల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డా.దవళ భాస్కరరావు స్వయంగా కలిసి మాట్లాడారు. గ్రామంలో మిగిలిన ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపైన అడిగి తెలుసుకున్నారు. పెదగంట్యాడ ప్రాథమిక ఆరోరగ్య కేంద్రం వైద్యాధికారిణి డా.ఎం.వి.ఎస్.అన్నపూర్ణని, సిబ్బందిని ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలను అందించాలని ఆదేశించారు.

దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఇస్లాంపేట, కెఎన్.పాలెం గ్రామంలో డెంగ్యూ సంభవించి తగ్గిన వ్యక్తితో స్వయంగా మాట్లాడారు. ఆరోగ్య కేంద్రంలోని బయట రోగుల విభాగము, ఫార్మసీ, వార్డు, లేబర్‌రూమ్‌ను పరిశీలించారు. 24గంటలు సేవలు అందించాలని ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్యాధికారి డా.అమృత సాయిని ఆదేశించారు.

స్టీల్‌ప్లాంట్ ఆవరణలో గల సెక్టార్-11ను సందర్శించినారు. డెంగ్యూ అనుమానిత రోగుల రక్త నమూనాలను వ్యాధి నిర్ధారణకు తక్షణమే విశాఖపట్నంలోని కెజిహెచ్‌లోని వైరాలజీ డిపార్టుమెంటుకు పంపించాలని ఆదేశించారు. యాంటీ లార్వా ఆపరేషన్ మరియు స్ప్రేయింగ్ కార్యక్రమములు క్రమం తప్పకుండా చేయించాలని ఆదేశించారు.

## రాజకీయాలకు అతీతంగా అందరూ అభిమానించే వ్యక్తి టిఎస్ఆర్

**- తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్**



విశాఖపట్నం : తెలుగుశక్తి అధ్యక్షులు బి.వి.రామ్ ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు మరియు రాజ్యసభ సబార్డినేట్ లెజిస్లేటివ్ కమిటీ చైర్మన్ డా॥ టి.సుబ్బరామిరెడ్డి నివాసంలో సోమవారం ఉదయం ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిఎస్ఆర్ చేత కేక్ కట్ చేయించారు.

ఈ సందర్భంగా బి.వి.రామ్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అందరూ అభిమానించే వ్యక్తి టి.ఎస్.ఆర్ అని అన్నారు. భారతదేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు టిఎస్ఆర్‌ని అభిమానిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో టిఎస్ఆర్ కళల పట్ల ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు చేసి ప్రజల గుండెల్లో మంచిస్థానం పొందిన వ్యక్తి టిఎస్ఆర్ అని రామ్ అన్నారు. గడిచిన 30 సంవత్సరాలుగా విశాఖను దత్తతగా తీసుకొని ప్రజల కష్టసుఖాల్లో పాల్పంచుకొని తనదైన పాత్ర పోషిస్తూ విశాఖ రూపురేఖలను దశదిశలుగా అందచందాలుగా తీర్చిదిద్దడంలో ఆయన చాణక్యత చెప్పదగనది కాదు. ఈ కార్యక్రమంలో గంట్ల శ్రీనుబాబు, కందుల నాగరాజు, తెలుగుశక్తి కార్యదర్శి వి.వంశీబాబు, వైఎస్సార్ నాయకులు కొయ్య ప్రసాద్ రెడ్డి, టి.గురుమూర్తి రెడ్డి, లాడే కిషోర్‌కుమార్, అన్ని రాజకీయ పార్టీల అభిమానులు పాల్గొన్నారు.

## అనాధుల ఆకలి తీర్చడం కోసం ప్రతీ ఒక్కరూ ముందుకొస్తున్నారు

భీమునిపట్నం : తగరపువలస లో వుయ్ కేర్ యు సంస్థ ఇన్ ఛార్జ్ వెంపాడ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అనాధుల ఆకలి తీర్చడానికి ప్రతిఒక్కరూ ముందం కొస్తున్నారని అన్నారు. గతంలో మేము గతము లో ఎంతో కృషి చేసేవారమని ఇప్పుడు ప్రతిఒక్కరూ బాధ్యతగా మా దృష్టికి తీసుకువస్తున్నారని తెలిపారు. కాగా మండలం లోని గల్లీమూలకుద్దు, రాజలింగం పేట ప్రజలు వినాయక విగ్రహాన్ని పెట్టుకుని అన్నదాన కార్యక్రమం ముందుగా అనాదపిల్లలకు పెట్టాలనే ఉద్దేశ్యం తో సంస్థను సంప్రదించినట్లు తెలిపారు. అయితే సంస్థ సభ్యులు వెళ్లి ఆ భోజనంను విజయనగరం,చాకలిపేట లో ఉన్న హవేమ్ హోమ్ లోఉన్న 120మంది పిల్లలకు పెట్టగా మిగిలిన భోజనంను కూలీలకు, బిచ్చగాళ్ల కు పంపిణి చేసామని తెలిపారు. అలాగే తగరపువలస వాస్తవ్యులు సాయిరాం ఫ్యామిలి రెస్టారెంట్ అధినేత గిడుతూరి జనార్ధన్ తమ వద్ద నిరుపయోగంగ ఉన్న కొత్త వస్త్రాలు సుమారు ఏబై వేలు విలువ చేసేవి మన వుయ్ కేర్ యు స్వచ్ఛంద సేవా సంస్థ కు ఇచ్చారు వాటిని మేము విజయనగరం లో రామనారాయణం దరి హవేన్ హోమ్ లో ఉన్న 120 మంది అనాధ గిరిజనులకు చేరవేర్చాము వారికి ఆ వస్త్రాలు ఇచ్చేము వారి ఆనందం ఎంతో మరి చెప్పలేము ఇటువంటి కార్యక్రమం మా చేతుల మీదుగా చేయించినందుకు జనా కి మా సంస్థ తరపున ధన్యవాదాలు ఈ కార్యక్రమం లో వెంపాడ శ్రీనివాసరెడ్డి , దేవిశెట్టి రాంబాబు , ఏలూరి రాంబాబు , విష్ణు , అప్పలసూరిరెడ్డి, వెంకట లక్ష్మి, రాణా,పాల్గొన్నారు ఇంకా ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు అప్పలసూరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం



భీమునిపట్నం : స్థానిక భీమిలి జోనల్ కార్యాలయం లో భీమిలి డివిజన్ టి.డి.పి. అద్యక్షులు గంటా. నూకరాజు పలు సమస్యలపై గ్రీవెన్సు లో జోనల్ కమీషనర్ పి. దుర్గాప్రసాద్ వినతి పత్రం, అందజేసారు. భీమిలి లో కుళాయిలు ద్వారా మంచి నీరు చాలా అద్వాన్నంగా వస్తోందని, ఇంటికి సరిపోయిన నీరుని సప్లై చేసి సామాన్యులకు ఇబ్బంది లేకుండా చేయాలని, 14వ వార్డు రాయపాలెం లో రజకుల ధోభీఖానా లు అసంపూర్తిగా ఉన్నాయని వాటిని మరమ్మతులు చేయించి రజకులకు అందుబాటు లోకి తేవాలని. అదేవిధంగా ఈ ప్రాంతంలో 45 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. చుట్టూ ముళ్ల పొదలు తొలగించచాలని బీచ్ లో శ్రీ పొట్టి శ్రీరాములు పార్కుకి, పావురాల షెడ్డుకి మధ్యలో ఉన్న రోడ్డు ను జజ రోడ్డు గా మార్చి ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ కు ఉపయోగించాలని, 15వ వార్డు రెల్లివీధి, 16వ వార్డు తోటవీధి మరియు 20వ వార్డు బోయవీధి లో అ సంపూర్తిగా ఆగిన సామాజిక భవనాలను పూర్తిచేయవలెను. 21వ వార్డులో ఎగువపేట లో ఉన్న సామాజిక భవనానికి కరెంటు సప్లై అదే విధముగా పేన్లు వేయవలెను భీమిలి డివిజన్ 14వ వార్డు నుండి 27వ వార్డు వరకు శంఖుస్థాపనలు చేసిన పనులను వేగవంతం చేయాలని కోరారు.

## గంటాను విమర్శించే స్థాయి నీకు లేదు



భీమునిపట్నం : స్థానిక గంటా క్యాంపు కార్యాలయం లో భీమిలి డివిజన్ టి.డి.పి. అద్యక్షులు గంటా నూకరాజు అద్యక్షత సమావేశం జరిగింది ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ మంత్రి గంటా శ్రీనివాసరావు రు ఎంతో కష్టపడి ఈ నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని, నీతి నిజాయితీ గల రాజకీయాలకు చిరునామాగా మారిన వ్యక్తి కాబట్టి ఏ నియోజకవర్గంలో పోటీచేసిన అత్యధిక మెజారిటీతో గెలుస్తున్నారని అలాంటి వ్యక్తిని విమర్శించడం ద్వారా పాపులారిటీ సంపాదించాలనే ఉద్దేశ్యంతో గుడివాడ అమర్ నాద్ విమర్శించడం తగదని అన్నారు. మంత్రి గంటా శ్రీనివాసరావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాపై లేనిపోని ఆరోపనులు చేస్తున్నారని, వీటిని నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాలు నుండి తప్పుకుంటానని ఛాలెంజ్ చేసారని. ఇంతవరకు మీరు వాటిని నిరూపించలేక పోయారు. మీరు ఏది మాట్లాడినా రాయడానికి మీ కరపత్రం ఉంది కాబట్టి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, మీ పార్టీలో ఉన్న బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు ఉత్తరాంధ్ర లో ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేయడమే కాకుండా వీరిని చూస్తే గొప్ప గొప్ప కంపెనీలు వెనుకకు వెళ్లిపోయాయని, ఇలాంటి వ్యక్తులు ఉన్న పార్టీలో మీరు ఉండి గంటాని విమర్శించడం తగదన్నారు. మీకు రాజకీయ భవిషత్తుని ఇచ్చింది తెలుగుదేశం పార్టీ,అని మీరు టి.డి.పి నుంచి కార్పొరేటర్ గా గెలిచి పాపులర్ అయ్యావని నీ స్థాయిని భట్టి మాట్లాడాలి తప్ప స్థాయిని మించి మాట్లాడ కూడదని నూకరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, పెంటపల్లి యోగీశ్వరావు, చురకల రమణ, కనకల అప్పలనాయుడు, మారోజు సంజీవ కుమార్, గిడుతూరి శ్రీనివాస రావు, భాగం గోపాల్, అప్పికొండ అప్పలనాయుడు, కంచెర్ల కామేష్, గూడుపు రాజు, మట్టా దాసు, రఘు, వియ్యపు పోతురాజు పాల్గొన్నారు.

## అన్ని దానాలలోనూ అన్నదానం మిన్న

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



చినవాల్తేరు : అన్ని దానాలలోనూ అన్నదానం మిన్న అని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. కిర్లంపూడి లేఅవుట్‌లోని శ్రీ పాల్ టవర్స్ యజమానుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయగణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. సంఘం అధ్యక్షుడు మస్తాన్‌రావు, స్వామినాథన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ సినీనటుడు కాదా

ఎమ్మెల్యేపై ఆగ్రహించిన సీతారాం



అనకాపల్లి : తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలో పని చేస్తూ నెలల తరబడి జీతాలు లేక ఆకలి చావులు చనిపోయిన 40 మంది కార్మికుల కుటుంబాలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని జనసేన నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం డిమాండ్ చేశారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో సోమవారం కార్యకర్తల చేరిక కార్యక్రమం జరిగింది. మొత్తం 70 మంది యువకులను ఈ సందర్భంగా సీతారాం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ఆరుగురు రాష్ట్ర మంత్రులను ఫ్యాక్టరీకి తీసుకొస్తానని ఎమ్మెల్యే చెబుతున్నారని, వారి సమక్షంలోనే పరిహారం ఇవ్వాలని కోరారు. అలాగే ఆయా కుటుంబాల్లో ఎవరో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇకపోతే ఎమ్మెల్యే పీలా తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ను ఒక సినిమా వాడంటూ హేళన చేస్తున్నారని, టిడిపిని స్థాపించిన దివంగత నందమూరి తారక రామారావు కూడా సినీ నటుడనే విషయాన్ని గుర్తుంచుకుంటే బాగుంటుందన్నారు. ఇంత వరకు సంయమనంతో వ్యవహరించాలని, ఇకపై ఎమ్మెల్యేకు తగిన రీతిలోనే స్పందిస్తామని చెప్పారు. కబ్జా కోరులు, లంక దేశంలో వ్యాపారాలు చేసుకునే వారు కేసులు పెడతామంటే భయపడే స్థాయిలో జనసేన కార్యకర్తలు లేరనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. తుమ్మపాల సుగర్స్ విజయాన్ని ఉమ్మడి విజయంగా తాము అంగీకరిస్తున్నామని, ఎమ్మెల్యే పీలా కూడా అలా అంగీకరించగలరా అని ప్రశ్నించారు. నిజాయితీ గల కార్యకర్తలు తమ సొంతమని, ఇకపై రాజకీయంగా అన్నింటా విజయం జనసేనదే అని సీతారాం అన్నారు. ఈ కార్యక్రమంలో వాకాడ మదన్, సురభి హరీష్, వైభవ్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానంకు మించిన 'దానం' మరొకటి లేదు!

**స్వాతి ప్రమోటర్స్ ఛైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి**



విశాఖపట్నం: సాటి మానవునికి కడుపు నింప గలిగితే దానికి మించిన సేవ మరొకటి లేదని స్వాతి ప్రమోటర్స్ ఛైర్మన్ తెలుగుదేశం పార్టీ నాయకులు స్వాతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక 35వవార్డు యెల్లబిల్లి వీధిలో సన్‌బోయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి వినాయక మహోత్స వాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి స్వాతి ప్రమోటర్స్ ఛైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానా లలో అన్నదానానికి చాలా ప్రాముఖ్యత ఉందని, ఆకలితో ఉన్న సాటి మనిషికి కడుపునిండా అన్నం పెట్టగలిగితే దానికి మించిన దానం మరొకటి లేదని భావించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో వెయ్యిమందికి పైగా భక్తులు అన్నదానం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఈతలపాక సుజాత, మళ్ళ శిల్పి కిరణ్, కనక, సత్యవతి, సన్‌బోయ్స్ కమిటీ సభ్యులు దుంప రవి, దుంప కుమార్, సుజన్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

**DMK ITI (p)**
TRADES: Electrician & Fitter Scholorship for Eligible Candidates
Note: అతి తక్కువ ఫీజులకు సీటు ఇవ్వబడును
Sabbavaram, Visakhapatnam (Dt.) 531035
Contract: 83090 08289

**APOSS** (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఓపెన్ స్కూల్)
Direct: SSC & Inter ( Any group ) One Sitting pass Guarantee, DMK Junior College, Sabbavaram, Visakhapatnam (Dt). 531035
Contact: 9441426955, 7396221464

**SREE KUSUMA HARANATH COLLEGE OF EDUCTION (D.ED.,)**
2017-19 Batch సీట్లు అతి తక్కువ ఫీజులకు ( 1 సం. కలిసొచ్చును )
2017-19 Batch సీట్లు కూడా అతి తక్కువ ఫీజులకు ఇవ్వబడును.
Sabbavaram, Visakhapatnam (Dt). 531035
Contact: 9441426955, 7396221464

# బీజేపీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోంది : బోళ్ళ



అమలాపురం : బీజేపీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని మరోసారి రుజువైందని, నియంత మోదీని ఎదిరించిన ఏకైక వ్యక్తి సీఎం చంద్రబాబేనని, అందుకే కేంద్ర ప్రభుత్వం తమ నేతను టార్గెట్ చేసిందని తూర్పు గోదావరి జిల్లా తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ళ వెంకట రమణ ఆరోపించారు. విలేకరుల సమావేశంలో రమణ మాట్లాడుతూ... ముందునుంచీ అందరూ అనుమానిస్తున్నట్లే బీజేపీ తెలుగు ప్రజలను, సీఎం చంద్రబాబును టార్గెట్ చేసినట్లు తాజాగా బాబ్లీ ప్రాజెక్టుపై వచ్చిన కోర్టు నోటీసులను చూస్తే అర్థమవుతుందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా సీఎం చంద్రబాబును ఎవరూ ఏమీ చేయలేరన్నారు. కేవలం తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం 2010లో చంద్రబాబు బాబ్లీ ప్రాజెక్ట్‌ను సందర్శించారని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై పోరాడుతున్నందునే చంద్రబాబుపై కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నిందని విమర్శించారు. ఈ కుట్రలో ప్రధాని మోదీ, అమిత్ షా, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రధాన సూత్రధారులని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తెలుగు ప్రజలంతా చంద్రబాబు వెంటే ఉన్నారని, ఆయన్ని ఎవరూ ఏమీ చేయలేరన్నారు. సీఎంకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా, అరెస్ట్ చేసినా తెలుగు ప్రజలంతా మూకుమ్మడిగా స్పందించి ఆయనకు అండగా నిలుస్తారని రమణ చెప్పారు.

# కలుషిత జలాలు సరఫరాపై ఆందోళన

తాళ్లరేవు: మంచినీటి కొళాయి నుండి కలుషిత జలాలు సరఫరా అవ్వడంపై తోటపేట గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ కొళ్ళాయి నీటిపై ప్రజలు ఆధారపడి ఉన్నారని వచ్చే కొద్దిపాటి నీరు. బురదగా వస్తుండటంతో అంటువ్యాధులు ప్రభలుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ కొళ్ళాయి పైపుద్వారా 20 కుటుంబాలకు కలుషిత జలాలు వస్తున్నాయని మిగిలిన వీధులలో నీరు శుభ్రంగా వస్తుందన్నారు. ఈ విషయంపై పంచాయతీ అధికారులకు అనేక సార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని స్థానిక మహిళలు దడాల సత్యవతి, మంగాదేవి, మరియమ్మ, శ్యామలా, మహలక్ష్మిలు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు.

# సత్యదేవున్ని దర్శించిన ప్రముఖులు

అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివార్ని కొందరు ప్రముఖులు సోమవారం దర్శించారు. వీరిలో ముఖ్యంగా ఓయన్జీసీ గ్రూప్ జనరల్ మేనేజర్ డా.అల్కా.మిట్టల్ , డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎన్ సిసి డైరెక్టరేట్ ఎయిర్ కమాండర్ ఎన్.ఎన్.రెడ్డి మరియు గ్రూప్ కమాండర్ ఎల్.సి.యస్.నాయుడు కుటుంబ సభ్యులతో శ్రీ స్వామివార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. అదేవిధంగా రాజస్థాన్ హూమన్ రైట్స్ కమీషన్ చైర్ పర్సన్ జస్టిస్ ప్రకాష్ తోటియా కుటుంబ సభ్యులతో శ్రీ స్వామివార్ని దర్శించారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతము పలికారు.వీరికి దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేశారు.అనంతరం శ్రీ స్వామివారి తీర్ధ,ప్రసాదాలను అందజేశారు.

# ఉద్యోగులు ఆందోళన



యానాం: వేతనాలు అందడంలేదని పాలిటెక్నిక్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. సోమవారం ఉదయం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాల ఉద్యోగులు ప్రధాన గేటు వద్ద ఆందోళన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేశారు. నెలదాటి పదిహేను రోజులు గడిచినా వేతనాలు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని దీనికి నిరసనగా విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టామన్నారు. ఈ విషయంపై పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావుకు పుదుచ్చేరి సాంకేతికవిద్య అధికారులకు ఫిర్యాదుచేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ ఆందోళనలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫిల్టర్ బెడ్‌లు శుభ్రంచేస్తూ కార్మికుడు మృతి

యానాం: కనకాలపేట రక్షిత మంచినీటి పథకంలో ఫిల్టర్ బెడ్‌లు శుభ్రంచేసే పనిలో కాంట్రాక్టరు అధికారుల నిర్లక్ష్యానికి కార్మికుడు దరియాలతిప్పకుచెందిన రొక్కం వెంకటేశ్ ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతిచెందాడు. యానాం ఎస్ఐ వి. శివకుమార్ చెప్పిన వివరాలు ప్రకారం... రక్షిత మంచినీటి ఫిల్టర్ బెడ్‌లలో ఇసుక తొలగించి రాళ్ళను శుభ్రపరిచే పనికి వెళ్ళిన మృతుడు వెంకటేశ్ ఇసుక బస్తాను క్రింద నుంచి మోసుకువెళ్ళాక రాళ్ళను శుభ్రంచేసే చోటే ఒక్కసారిగా కుప్పకూలి నోటి నుండి నురుగలు వస్తుండటంతో తోటిపనివారి యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరిక్షించి వెంకటేశ్ మృతిచెందినట్లు నిర్ధారించడంతో అతడు సోదరుడు ధృవకుమార్‌కు తోటి కార్మికులు సమాచారం అందించారు. ఈ మృతిపై కుటుంబ సభ్యులు బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణకు డిమాండ్ చేశారు. తన సోదరుని మృతికి కారణాలు వైద్యపరంగా నిర్ధారించి తెలియజేయాలని ధృవకుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతడు మిట్టమధ్యాహ్నం చనిపోగా నాలుగు గంటలు గడిచినా ప్రజాపనుల శాఖ అధికారులు, కాంట్రాక్టరు ఆసుపత్రికి రాకపోవడంతో మృతుని బంధువులు తీవ్ర ఆవేశానికి గురయ్యారు. జరిగిన ఘటనగురించి యానాం ప్రజాపనులశాఖ ఇఇ రాందాసు, జెఇ హుసేన్‌లను వివరణ కోరగా ర్యఫీడు స్టాండు ఫిల్టర్‌లో వేసేందుకు కావలసిన ప్రత్యేక ఇసుక తెచ్చే బాధ్యత రాళ్ళను శుద్ధిచేసే పనిని నిపుణులైన కార్మికులతో కాంట్రాక్టర్ పిఎస్ రాజేశ్వరరావుతో చేయిస్తున్నామన్నారు.

దీర్ఘకాలంపాటు కోట్లాది లీటర్లనీటిని శుద్ధి చేయవలసిన ఫిల్టర్ బెడ్‌ల శుభ్రత ప్రకియను నిపుణులతో శాస్త్రియ పద్ధతిలో చేయించాలని అనర్హులైన వారికి పనులు అప్పగించి అధికారులు నిబంధనలు ఉల్లంఘించడం, తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంవలన మృతుడి వెంకటేశ్ మృతిచెందాడని దీనికి కారకులయిన వారిని సమగ్ర దార్యప్తుచేసి కేసు నమోదుచేసి చట్టపరంగా శిక్షించాలని పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహానికి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల ఆర్తనాదాల మధ్య దరియాలతిప్ప శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

# సమాచార హక్కు చట్టం సద్వినియోగం చేసుకోండి రాష్ట్ర చైర్మన్ చక్రవర్తి



పెద్దాపురం: సమాజంలో జరుగుతున్న అక్రమాలు, అవినీతిని, ప్రజలకు తెలియజేయడానికి సమాచార హక్కు చట్టం ప్రతిపౌరుడు వినియోగించుకోవాలనిన సమాచార హక్కు చట్టం రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్ఎస్ చక్రవర్తి అన్నారు. స్థానిక మరిడమ్మ అమ్మవారి దేవస్థానం కాలక్షేప మండపంలో నియోజకవర్గ సమాచార హక్కు నూతన కార్యవర్గ సమావేశంలో చక్రవర్తి ప్రసంగించారు.

ప్రజల ఆమోదంతో పాలించే పాలకులు, ప్రజల సంక్షేమం, అభివృద్ధికి అమలు చేయవలసిన చట్టాలను, ఆదేశాలను, అనుసరించకుండ. వాటిని తుంగలోకి తొక్కి అవినీతికి, అక్రమాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రతిపౌరుడు సమాచార హక్కు చట్టం ద్వారా ప్రశ్నించి, నిజాన్ని బట్టబయలుచేయడానికి కంకణ బద్దుడు కావాలని చక్రవర్తి కోరారు. ఈ చట్టం ద్వారా ప్రశ్నించిన నెల రోజులలో ప్రశ్నించిన వాటికి సమాధానం ఇవ్వాలని లేనియెడల చర్యలు తప్పవన్నారు.

ఈ సమావేశంలో జిల్లా చైర్మన్ ఎం శివకుమార్, వైస్ చైర్మన్ కె. పవన్‌కుమార్, నియోజకవర్గ చైర్మన్ డి. సతీష్, మాడపల్లి రాజారావు, చంద్రా రెడ్డి సత్యనారాయణ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం పెద్దాపురం నియోజకవర్గ సమాచార హక్కు చట్టం నూతన కార్యవర్గం ప్రకటించారు. అధ్యక్షులు డి. సతీష్, ఉపాధ్యక్షులు ఎం. వెంకటరమణ, కార్యదర్శి ఎన్ సత్యనారాయణ, ఉప కార్యదర్శి దుర్గాదేవి, ట్రెజరర్ వీరబాబు, సభ్యులుగా సిద్దు, లీగల్ అడ్వజర్, ఎస్‌కె. వల్లీబాబు, ఎం. గౌరీనాథం, కె. శ్రీనివాస్, మదీనా భాషాలు నియమించబడినారు.

# మండలంలో కుక్కలబెడద



అనంతగిరి : మండలంలో కుక్కలబెడద ఎక్కువకావడంతో మండలంలో ఎక్కువగా కుక్కకాటుకుగురై ఆసుపత్రి పాలౌతున్నామని అలాగే కొంతమంది ఆసుపత్రి అందుబాటులో లేని గ్రామాల వాసులు వైద్యచికిత్సఅందక ప్రాణాలు కోల్పోవుతున్నామని బాధితులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో నిసానిగూడా గ్రామంలో కుక్కకాటుకు గురిఅయ్యి ఆసుపత్రికి పాలయ్యాడు ఎక్కడపడితే అక్కడ కుక్కల బిభిత్సవం వాహన చోదకులకు ఇబ్బందిగా మారిందని రెండు చక్రాల మోటారు వాహన చోదకులైతే మరింత ప్రమాదానికి గురి అవుతున్నామని మండలవాసులు అంటున్నారు. పంచాయతీ అధికారులు చొరవతీసుకొని కుక్కలను నివారించాలని స్థానిక గిరిజనులు కోరుచున్నారు.

# మీకోసంలో 387 దరఖాస్తులు



విశాఖపట్నం: సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తమ వినతులను అధికారులకు సమర్పించారు. సోమవారం మీకోసం కార్యక్రమానికి 387 దరఖాస్తులు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ శ్రీమతి జి. సృజన, జాయింట్ కలెక్టర్-2 డా.. సిరి, డిఆర్ఓ చంద్రశేఖర రెడ్డి, ఎస్‌డిసి గోవిందరాజులు, ట్రైనీ కలెక్టర్ కె. దినేష్ కుమార్ మీకోసం కార్యక్రమంలో పాల్గొని పలు ప్రాంతాల నుండి వచ్చిన వారి నుండి స్వయంగా వినతులను స్వీకరించారు. గృహాలు, రేషన్‌కార్డులు, భూమి వివాదాలు, పింఛన్లు మంజూరు మరియు ఇతర సమస్యలను సంబంధించిన విజ్ఞాపనలను సమర్పించారు. మీ కోసం కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**డయల్ యువర్ కలెక్టర్‌కు 5 ఫోన్ కాల్స్ :**

సోమవారం ఉదయం డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో భాగంగా 5 ఫోన్ కాల్స్ ద్వారా బాధితులు తమ వినతులను విన్నవించుకున్నారు. జెసి 2 డా..సిరి, డిఆర్ఓ చంద్రశేఖర రెడ్డి ఫోన్ కాల్స్ స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు.

# అన్నవరంలో ఉచిత డ్రైవింగ్ లైసెన్సు మేళా



అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఉచిత డ్రైవింగ్ లైసెన్సు మేళాను శంఖవరం మండలం అన్నవరం గ్రామ పంచాయతీ వద్ద కత్తిపూడి ఆర్టీవో అదికారులు నిర్వహించారు. ఈ లైసెన్సు మేళాకు అధిక సంఖ్యలో విద్యార్థులు, గ్రామస్తులు తమ తమ సర్టిఫికెట్లతో వచ్చి యల్ యల్ ఆర్ లను నమోదు చేసుకున్నారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన లైసెన్స్ మేళా విజవతమైనదని యల్ యల్ ఆర్ పొందిన పలువురు విద్యార్థులు,గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా యల్ యల్ ఆర్ పొందిన విద్యార్థి పదిలం.రామకృష్ణ తరుణ్ మాట్లాడుతూ గ్రామంలో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టిన ఆర్టీవో అధికారులు, గ్రామ టీడీపీ నేతల కృషి అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో అధికారులు గ్రామ మాజీ సర్పంచి రాజాల.గంగాభవాణి, మండల వైస్ ప్రెసిడెంట్ బొమ్మిడి.సత్తిబాబు, టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ వీర్ల.సూరిబాబు, రాజాల.చిట్టిబాబు, మడ్డు.వీరబాబు, బలువు.రాంబాబు, పలివెల.సతీష్, బండారు.సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని మంత్రి మోడి జన్మదినం సందర్భంగా డాబాగార్డెన్స్‌లో ప్రేమసమాజంలో బిజెపీ రాష్ట్ర ఎస్సీ మోర్చ ఎగ్జిక్యూటివ్ బాదం అశోక్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా బిజెపీ రాష్ట్ర కార్యదర్శి కాశి విశ్వనాధ్‌రాజు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దక్షిణమూర్తి, బిజెపీ రాష్ట్ర మైనార్టి మోర్చ వైస్ ప్రెసిడెంట్ ఒల్‌బర్ట్ పాల్గొన్నారు.

# రత్నగిరిపై పురావస్తు కట్టడాలు కూల్చివేత నిర్ణయముపై గ్రామస్థులు ఆగ్రహం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి ప్రధాన ఆలయం పునర్నిర్మాణము తరువాత గడచిన ఆరు సంవత్సరములుగా ఎటువంటి అభివృద్ధి పనులు జరగకపోగా ఇటీవల 138 గదులు శివసదన్‌కు ఉన్నత అధికారులు నుంచి అనుమతులు తెప్పించుటతో పాటు ఆ నిర్మాణం కోసం విరివిగా విరాళాలు సేకరించడం మరియు అదే సమయములో పాలకమండలి సభ్యులు సహకారముతో భుతాధి నూతన భవన నిర్మాణం,సత్యగిరిపై ఉచిత ఏసి కళ్యాణ మండపాలకు శంకుస్థాపన జరగడం వంటి కార్యక్రమాలు ఎంతో అనందదాయకమని గ్రామస్థులు తెలిపారు. అయితే ఈ ఉత్సాహముతోనే ప్రస్తుతం రత్నగిరిపై రామాలయం సమీపంలో ఉన్న మెయిన్ గెస్ట్ హౌస్, శ్రీ రాజా వెంకట రామరాయ కళా మందిరములను తొలగించాలని ఇటీవల జరిగిన పాలకమండలి సమావేశంలో తీర్మానించడముపై గ్రామస్థులు,భక్తులు ఆవేదన వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు సోమవారం ఆలయ ఈవో మారిశెట్టి.జితేంద్రను కలసి పురాతన కట్టడాల కూల్చివేతపై అభ్యంతరము తెలుపుతూ ఈవో జితేంద్రకు ఒక వినతి పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థులుగా మాకు స్వామివారి ఆలయంతో విడదీయలేని అవినాభావ సంబంధం ఉందని కేవలం రెండు సంవత్సరముల కాల పరిమితికి నీయమించబడ్డ సభ్యుల కన్నా ఇక్కడ పుట్టి పెరిగిన మాకు దేవాలయంపై మరింత ఎక్కువ బాద్యత ఉందని తెలియజేసారు. అలా కాకుండా పాలకమండలి తీర్మాణమే ప్రామాణికంగా ముందుకు వెళ్ళితే దశల వారీగా నిరసనలు చేయడానికి ఏమాత్రం వెనకాడమని గ్రామస్థులు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచి రాజాల.గంగాభవాణి, రాజాల.చిట్టిబాబు, మండల వైస్ ప్రెసిడెంట్ బొమ్మిడి. సత్య నారాయణ, టీడీపీ టౌన్ అధ్యక్షుడు వీర్ల.సూరిబాబు, బలువు. రాంబాబు, పలివెల.సతీష్, మడ్డు.వీరబాబు, సరమర్ల.మధుబాబు, కొండపల్లి. అప్పారావు, యస్.మోషేరావు, బిఎస్వీ.ప్రసాద్, బత్తుల.రవికుమార్, బొబ్బిలి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ 'బుంగా' సేవలు మరువలేనివి



అమలాపురం : తుమ్మలపల్లి గ్రామంలో డాక్టర్ పరమట నరసింహమూర్తి ఆధ్వర్యంలో డాక్టర్ బుంగా భాస్కరరావు సంతాప సభ సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డాక్టర్ పరమట నరసింహమూర్తి విచ్చేసారు. ఆయన మాట్లాడుతూ భాస్కరరావు తుమ్మలపల్లిలో పుట్టి మెడిసిన్ చదివి వైద్య వృత్తిలో ఉన్నతమైన హోదాలు అధిష్టించారన్నారు. ఆయన అకాల మరణానికి సంతాపం తెలియజేస్తూ గ్రామానికి ఆయనతో కలిసి తాను అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయటం జరిగిందన్నారు. ఆయనతో కలిసి తాను 4 మెడికల్ క్యాంపులు, ఉచిత దుప్పట్లు, పేద మహిళలకు చీరలు పంపిణీ వంటి అనేక కార్యక్రమాల్లో ఆయన మాతో పాలు పంచుకోవడం జరిగిందని గుర్తు చేసుకున్నారు. ఆయన లేని లోటు ఆ కుటుంబానికి తీవ్ర ఆవేదన మిగిల్చిందని, ఏదైనా ఆయన మరణం గ్రామానికి తీరని లోటు అని తెలియచేసారు. మరో అతిధి ప్రముఖ దళిత కవి, రిటైర్డ్ హెడ్ మాస్టర్, రచయిత సవేర మాట్లాడుతూ ఆయన తల్లిదండ్రులు సకాలంలో వైద్యం అందక మృతి చెందటంతో భాస్కరరావు పట్టుదలతో డాక్టర్ పట్టా చేపట్టి గ్రామీణ ప్రాంత పేదలకు వైద్య సేవలందించారని ప్రశంసించారు. 1971లో ఎంబిబిఎస్ పూర్తిచేసి ఎండి (జనరల్ మెడిషన్) పూర్తి చేశారన్నారు. తర్వాత గుంటూరు మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్‌గా సుదీర్ఘంగా 23 సంవత్సరాల కాలం పనిచేసి 2011లో పదవీ విరమణ చెంది విశ్రాంత సమయాన్ని కూడా వృధాకాకుండా ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్‌గా ముఖ్య విభాగాధిపతిగా సేవలు అందిస్తున్న సమయంలో భాస్కరరావు మృతిచెందడం బాధాకర విషయమన్నారు. అలాగే మాజీమంత్రి, వైకాపా నాయకులు పినిపే విశ్వరూప్ గ్రామంలో పర్యటనలో భాగంగా వచ్చి బుంగా భాస్కరరావుకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మచ్చ సత్యనారాయణ, ఇంజినీర్ వడ్డి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ పులుసుగంటి గంగాధర్, గుర్రం అశోక్, వుల్లూరి నాని, గ్రామ మాజీ ఉప సర్పంచ్ కె.శాంతి కిరణ్, నాతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# భూములు కనిపిస్తే కబ్జా చేస్తున్నారు





మొదటి పేజీ తరువాయి

వెళ్లేలా ప్రోత్సహిస్తారు. చిట్టివలస జ్యూట్ మిల్లును ఎన్నికలకు ముందు మంత్రి గంటా నెలరోజుల్లో ఈ మిల్లును తెరిపిస్తానని హామీ ఇచ్చారు. నాలుగున్నరేళ్లయినా ఇంత వరకు ఆ జ్యూట్ మిల్లు తెరుచుకోలేదు. విశాఖ సమ్మిట్ పేరిట మూడు రోజులు తినడానికే రూ. 53 కోట్లు ఖర్చు పెట్టారు. 40 లక్షల ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. వచ్చాయా అని అడుగుతున్నా? చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం 18 జ్యూట్ మిల్లులు మాత్రమే నడుస్తున్నాయి. ఈ పెద్దమనిషి వచ్చిన తరువాత యూనిట్ ధరను పెంచారు. చెక్కర ఫ్యాక్టరీలు మూతబడుతున్నాయి. కొత్త ఉద్యోగాలు దేవుడెరుగు ఉన్న ఉద్యోగలు ఊడిపోతుంటే ఈ పెద్దమనిషికి చీమకుట్టినట్లు కూడా లేదు. ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. శంకుస్థాపన కూడా చేశారు. ఇప్పుడు ఆ శంకుస్థాపన శిలాఫలకాన్ని కూడా తీసేశారు.

పోలవరం పనులను చూస్తే పునాది గోడలు దాటవు. చంద్రబాబు మాత్రం కుటుంబ సభ్యులతో గ్యాలరీ వాక్ చేస్తారు. ప్రత్యేక హోదా రాకపోవడానికి చంద్రబాబే కారణం. ఇప్పుడు ధర్మ పోరాట దీక్షలతో కొత్త డ్రామాలాడుతున్నారు. చంద్రబాబు పాలనలో ఆరోగ్య శ్రీ నిర్వీర్యమైంది. మరో ఆరునెలల్లో ఎన్నికలు రాబోతున్నాయి. మీ మనస్సాక్షికి తగ్గట్లు ఓటేయండి. మీ అందరి ఆశీస్సులతో మనందరి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నవరత్నాలతో అన్ని వర్గాలను ఆదుకుంటాను. అని వైఎస్ జగన్ ప్రజలను కోరారు.













**వైఎస్సార్ సిపి అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయ కర్తగా నియమించబడిన కళాహాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తికి అభినందనలు తెలియజేస్తున్న నగర వైకాపా నాయకులు**

## రాష్ట్రంలోని అభివృద్దిని చూసి ఓర్వలేని వైకాపా

### - దమ్ముంటే అక్రమాలను, అవినీతిని బహిర్గతం చేయాలి



గాజువాక: రాష్ట్రంలోని తెదేపా ప్రభుత్వం చేస్తున్న అభివృద్దిని చూసి ఓర్వలేక వైకాపా మతిలేని ప్రేలాపన చేస్తుందని జిల్లా తెదేపా అధికార ప్రతినిధి పెంటకోట అప్పలనాయుడు పేర్కొన్నారు. సోమవారం మల్కాపురం ప్రకాష్ నగర్ 48వవార్డు తెదేపా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో 5వార్డుల తెదేపా నాయకులు మాట్లాడారు. ముందుగా పెంటకోట అప్పలనాయుడు మాట్లాడుతూ ఇటీవల మల్కాపురం ప్రాంతం ఎఎస్ఆర్ కాలనీలో హుద్‌హుద్ భాదితులకు నిర్మించిన ఇళ్ళ కేటాయింపులో అవకతవకలకు తెదేపా పాల్పడిందని వైకాపా నిందించడం సరికాదని అన్నారు. నీతికి నిజాయితీకి మారుపేరు తెదేపా అని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో స్థానిక ప్రజాప్రతినిధి గణబాబు పారదర్శక పాలన అందించడం పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, దీనిని చూసిన వైకాపా విమర్శించించడం దారుణమని అన్నారు. 49వ వార్డు తెదేపా అధ్యక్షులు మజ్జిసోమేష్ మాట్లాడుతూ దమ్ముంటే అవినీతిని నిరూపించాలని, దీనిపై చర్చకు సిద్ధమని, వైకాపా దీనికి సిద్ధమేనా? అని సవాల్ విసిరారు. అర్హులైన లబ్దిదారులకే ఇళ్ళను కేటాయించామని, దీన్లో ఎటువంటి అవకతవకలు జరగలేదని అన్నారు. తెదేపా పై చేస్తున్న తప్పుడు ప్రచారాలను మానుకోవాలని హితవుపలికారు. గత ఎన్నికలలో వైకాపాను ఓడించామని, రానున్న సార్వత్రిక ఎన్నికలలో తెదేపా విజయం తధ్యంమని అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కాకి పోలిరెడ్డి, కె.శ్రీనివాసరావు, కె.రాము, జి.కృష్ణ, డేవిడ్, జోగిబాబు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



*వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా 39వ వార్డు లో గల మాధవధార, తెన్నేటినగర్ ప్రాంతాల్లో యువత ఏర్పాటు చేసిన వినాయక మండపాలను 39వ వార్డ్ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు నంబాల్లా ఈశ్వర్ రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాధవధార విఘ్నేశ్వర యూత్ కమిటీ, తెన్నేటి నగర్ lovely guys యూత్ కమిటీ ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.*

## ఆత్మహత్యా యత్నంలో బాలికను రక్షించిన ఆలమూరు పోలీసులు

ఆలమూరు : మండల పరిధి జొన్నాడ గోదావరి బ్రిడ్జి సమీపంలోని ఏటిగట్టు వద్ద ఆత్మహత్యా ప్రయత్నానికి పాల్పడిన బాలికను ఆలమూరు పోలీసులు రక్షించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే తాళ్లరేవు మండలం, గోవలంకకు చెందిన వి.దుర్గాభవాని (15 సం॥లు) పదవ తరగతి చదువుతూ తన చెల్లెలితో రామచంద్రపురం ఎస్.సి. బాలికల వసతి గృహంలో వుంటున్నది. తల్లి దుబాయ్‌లో వుండగా తండ్రి వ్యవసాయ కూలి. బాలిక అమ్మమ్మ ఊరు దంగేరు గ్రామానికి చెందిన జనిపల్లె నాగేంద్రతో ఈ బాలికకు పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు, బంధువులు మందలిచడంతో మనస్తాపం చెందిన సోమవారం ఉదయం రామచంద్రపురం హాస్టల్ నుండి ఆటోలో బయలుదేరి జొన్నాడ ఏటిగట్టు వద్ద దిగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ఆలమూరు పోలీసులు గమనించి బాలికను పట్టుకొని పోలీస్‌స్టేషనుకు తీసుకువచ్చి బంధువులకు సమాచారం అందించారు.

## దళితులపై దాడులు ఆపాలి

రావులపాలెం: కులదురహంకారంతో హత్య చేసిన హంతకులపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసును నమోదు చేసి, శిక్షించాలని కోరుతూ దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోనసీమ ముఖద్వారం వద్ద అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నిరసన ర్యాలీ చేపట్టారు. కొవ్వొత్తులు చేతబూని జాతీయ రహదారిపై రావులపాడు సెంటర్, పాత ఎల్.ఐ.సి. బిల్డింగు మీదుగా కళా వెంకట్రావు సెంటరుకు చేరుకొని మానవహారం నిర్వహించారు. దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ, ఇటువంటి దురహంకార హత్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేసారు. అనంతరం ఎస్సై సిహెచ్ విద్యాసాగర్‌కు డిమాండులతో కూడిన వినతిపత్రాన్ని దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో అందజేసారు. ఈ సందర్భముగా సిఆర్ కప్పల వర ప్రసాద్ మాట్లాడుతూ నల్గొండ జిల్లా, మిర్యాలగూడ గ్రామానికి చెందిన మారుతిరావు తన కుమార్తె గర్భవతి అని చూడకుండా విచక్షణా రహితంగా అల్లుడుని అమానుషంగా చంపించివేయడం దారుణమన్నారు. తక్షణమే నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేసారు. ఇద్దరు ఇష్టపడి ఏళ్ళతరబడి ప్రేమించుకుని పెళ్ళి చేసుకొని చక్కగా కాపురం చేసుకుంటున్న దంపతులను ఆదరించాల్సిందిపోయి, హత్యకు పూనుకోవడం అమానుషమని, ఇది మానవజాతి సిగ్గుపడే చర్య అని అన్నారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున దళిత నాయకులు పాల్గొని నిరసన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో కొండేపూడి రామకృష్ణ, మాసాబత్తుల ఆనంద్, కోనాల వెంకట్రావు, గాడి క్రిష్టాఫర్, కుసుమే ప్రవీణ్, నేకూరి రాజేష్ కుమార్, పమ్మి అమృతరావు, పమ్మి నరేష్, కప్పల శ్రీధర్, నక్కా ఐషయ్య, నామాడి శివాజి, కాకి సూరిబాబు, షేక్ అజహర్, పోతుమూడి శేషారత్నం, కాండ్రు వెంకటేష్, జాలాది సహదేవుడు, వడ్లమూడి శ్రీను, కుసుమే సురేష్, సాకా ధనరాజ్, కోలాటి వినయ్, చల్లాబత్తుల రాధాకృష్ణ, పొనుగుపాటి శ్రీనివాసరావు, గూడపాటి రాజేంద్ర, సాయి, బట్టు గణేష్, గూటం రాజశేఖర్, పోతుమూడి హరికృష్ణ, పోతుమూడి బుజ్జిబాబు, కోనాల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టిఎస్సార్ జన్మదినం... అభిమానుల కోలాహలం



విశాఖపట్నం: రాజ్యసభ సభ్యులు, రాజ్యసభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ ఛైర్మన్ డా.టి.సుబ్బరామిరెడ్డి జన్మదిన వేడుకలు సిరిపురంలోని తన నివాసంలో అభిమానుల మధ్య సందడిగా జరిగింది. పార్టీలకు అతీతంగా నాయకులు, అభిమానులు వచ్చి టిఎస్సార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. అభిమానుల కోలాహలం మధ్య టి.సుబ్బరామిరెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా టిఎస్సార్ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా తన పుట్టినరోజును ఇష్టమైన విశాఖలోనే జరుపుకుంటున్నానని అన్నారు. జన్మదినం నాడు ప్రతి ఏటా సినీ, సంగీత కళాకారులను సత్కరించడం ఆనవాయితీ అని తెలిపారు. తన మెకాళ్లకు శస్త్ర చికిత్స జరిగిన నేపధ్యలో 3 నెలల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యుల సూచనల మేరకు ఈ ఏడాది సెప్టెంబర్ 16న ఆధ్యాత్మిక ప్రముఖులకు, 17న సినీ సంగీత ప్రముఖుల జరగాల్సిన సత్కార కార్యక్రమాలు రద్దయ్యాయన్నారు.

ఈ ఏడాది ప్రముఖ సినీ నటి జయసుధ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు కూడా రద్దయినట్లు తెలిపారు. విశాఖ ప్రజలతో ఉన్న అనుబంధం దృష్ట్యా పుట్టినరోజు నాడు అభిమానులకు కలవడం జరిగిందన్నారు. ప్రతి ఏటా తన జన్మదినాన్ని విశాఖలోనే జరుపుకుంటానని టిఎస్సార్ స్పష్టం చేశారు. ప్రతి ఏటా శివరాత్రి ఉత్సవాలు కూడా ఇక్కడ తప్పక జరుగుతాయన్నారు. టిఎస్సార్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు బొత్స సత్యన్నారాయణ, ఎంపీ అవంతి శ్రీనివాసరావు, తిప్పల గురుమూర్తిరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు బెహరా భాస్కరరావు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, తిప్పల నాగిరెడ్డి, కొయ్య ప్రసాదరెడ్డి, పిఎస్ఎన్.రాజు, డా.ఎస్ఎ.రహమాన్, తిప్పల చినఅప్పారావు, సత్తి రామకృష్ణారెడ్డి, జహీర్ అహ్మద్, బాణాల శ్రీనివాసరావు, కొల్లాబత్తుల వెంగళరావు, యల్లపు రఘురామ్, గాయత్రీ ప్రాజెక్స్ లిమిటెడ్ అధికారులు, వైజాగ్ జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, కార్యదర్శి ఎస్.దుర్గారావు, ఇతర ప్రతినిధులు నాగరాజ్ పట్నాయక్, ఈశ్వరరావు, ఎంఎస్ఆర్.ప్రసాద్, స్మార్ట్‌సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బంగారు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి దొండా రమేష్, పలు సంఘాల నాయకులు ఉన్నారు.



# 'కాపు' కాసేది జగన్ మాత్రమే

## - డాక్టర్ రాకతో నగర వైకాపాలో నూతనోత్సాహం
## - వైకాపాలో చేరిన కాపు సంఘం నాయకుడు బండ్రెడ్డి రామజోగి



విశాఖసిటీ : సీనియర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, విశాఖజిల్లా కాపు సంఘం అధ్యక్షుడు రామజోగి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో జగన్ సమక్షంలో చేరారు. ఈ మేరకు వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి బండ్రెడ్డి రామజోగిని పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానిస్తూ ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని అందజేశారు. అనంతరం బండ్రెడ్డి రామజోగి మాట్లాడుతూ తాను సుదీర్ఘ కాలంపాటు జాతీయ కాంగ్రెస్‌పార్టీలో వుంటూ విశాఖ రాజకీయాల ఉద్ధండులైన ద్రోణంరాజు సత్యన్నారాయణ, గుడివాడ గురునాధరావు, వాళ్ల సాన్నిధ్యంలో అటు జాతీయస్థాయి, ఇటు రాష్ట్రస్థాయిలో కాపు సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేశామన్నారు. రాష్ట్రంలో కాపు సామాజిక వర్గాన్ని దివంగత నేత రాజశేఖరరెడ్డి హయాంలో కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ఆ సామాజిక వర్గానికి ఎనలేని కృషి చేశామన్నారు. ఆయన మరణానంతరం కాపులకు గుర్తింపు లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాపులను గుర్తిస్తామంటూ కాపులకు లేనిపోని ఆశలు కల్పించి కాపుఓట్లతో అందలం ఎక్కిన టీడీపీ ప్రభుత్వ పెద్దలు అధికారం చేపట్టాక కాపు సామాజిక వర్గాన్ని పూర్తిగా విస్మరించారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయకుండా కాపు సామాజిక వర్గాన్ని మరింత దిగువ స్థాయికి అణగదొక్కారని ఆయన అన్నారు. కాపు హక్కులపై పోరాటాలు చేస్తే వారిపై తప్పుడు కేసులు బనాయిస్తున్న టీడీపీ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో కాపుల సత్తా చూపుతామని ఆయన హెచ్చరించారు. మున్ముందు కాపులకు అన్ని విధాలా అవకాశాలు కల్పించాలంటే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి వలనే సాధ్యమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో తూర్పు గోదావరి జిల్లా ప్రజా సంకల్ప యాత్రలో కాపు కార్పొరేషన్‌కు పదివేల కోట్ల రూపాయలు కేటాయిస్తామని జగన్ హామీ ఇచ్చారని , రానున్న రోజుల్లో కాపు సామాజిక వర్గానికి న్యాయం జరగాలంటే అది ఒక్క జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని భావించి మహానేత తనయుడిగా మాట తప్పకుండా, మడమ తిప్పకుండా ఆయన బాటలో నడుస్తున్న జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీకి సేవ చేయాలనే సంకల్పంతో తాను ఈ పార్టీలోకి చేరానని బండ్రెడ్డి రామజోగి తెలిపారు.

*ప్రముఖ సంఘ సేవకుడు ఉత్తరాంధ్ర జిల్లాలోనే గుర్తింపు వున్న డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైనందుకు ఆయనకు తన శుభాభినందనలు తెలియజేస్తున్నానని రామజోగి తెలియజేశారు. విద్యావేత్త, సేవాతత్పరుడైన పి.వి.రమణమూర్తి ప్రజా జీవితంలో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. డా.రమణమూర్తి రాకతో నియోజకవర్గంలోనే కాక, నగర, జిల్లాల్లో కూడా పార్టీకి మరింత బలం చేకూరిందని ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఒక బలమైన సామాజిక వర్గ ప్రతినిధిగా ఆయన తన శక్తియుక్తులను పార్టీ అభివృద్ధికి అందజేస్తూ రాజన్నబిడ్డ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాలన్నదే తమ అందరి అభిలాష అని ఆయన తెలియజేశారు.*



# పర్యావరణ హితానికే విద్యుత్ వాహనాలపై భారత్ దృష్టి

## గీతం జాతీయ వర్క్‌షాప్‌లో నిపుణుల వెల్లడి



సాగర్‌నగర్ : కాలుష్య నివారణా చర్యలలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం దేశంలో 2030 సంవత్సరం నాటికి విద్యుత్ వాహనాలను అందుబాటులోకి తేవాలని లక్ష్యాన్ని నిర్దేశించిందని ఈ దృష్ట్యా ఎలక్ట్రిక్ వాహన పరిజ్ఞానంపై యువత అవగాహన పెంచుకోవాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం తేది: ప్రారంభం అయిన 'ఎలక్ట్రికల్ వెహికిల్స్-ఇంజన్ టెక్నాలజీ' జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో నిపుణులు పేర్కొన్నారు. ముఖ్యఅతిధిగా హాజరైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ డైరక్టర్ ప్రొఫెసర్ వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో వాహన వినియోగం పెరగటం తద్వారా వెలువడే కర్బన ఉద్గారాలతో కాలుష్యం పెరుగుతోందని దీనిని నియంత్రించడానికి పర్యావరణ హిత ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రత్యామ్నాయంగా ఎంచుకున్నారని తెలిపారు. విద్యుత్ వాహనాలకు బ్యాటరీ రీఛార్జింగ్ సమస్యగా మారకుండా ఉండాలంటే వాహనాలపై సోలార్ ప్యానల్స్‌ను అమర్చాలని సూచించారు. విద్యుత్ వాహనాల ద్వారా చమురు వినియోగంతో పాటు ప్రయాణం ఖర్చులు తగ్గించు కోవచ్చునన్నారు.

కార్యక్రమానికి ఆద్యక్షత వహించిన గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ పాఠ్య గ్రంధాలతో పాటు ప్రాక్టికల్ శిక్షణ పొందడం, మార్పులపై దృష్టి సారించడం ద్వారా విద్యార్థులు లక్ష్యాలను చేరుకోవచ్చునన్నారు.

మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎమ్.ఆర్.ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో 2030 నాటికి విద్యుత్ వాహనాలను వినియెగించాలన్న ప్రభుత్వ లక్ష్యాం నెరవేరాలంటే అందుకు తగ్గ నిపుణులు అవసరమన్నారు.విశిష్ట అతిధిగా హాజరైన మహీంద్రా ఎలక్ట్రిక్ మొబలిటి (బెంగళూరు) విద్యుత్ విహనాల ఎలక్ట్రానిక్స్ డిజైన్ విభాగం టెక్నాలజీ ఆర్కిటెక్ట్ అశ్విన్ సింహ మాట్లాడుతూ భారతీయ వాతావరణం, ప్రజల డ్రైవింగ్ అలవాట్లు, రహదారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ వాహనాలను డిజైనింగ్ చేయాలన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్‌తో పాటు ఎలక్ట్రికల్, మెటీరియల్‌సైన్స్, కంప్యూటర్ తదితర విభాగాల వారు సంయుక్తంగా ఆద్యయనం చేసి విద్యుత్ వాహనాలను తయారు చేయవచ్చునన్నారు. విద్యుత్ వాహనాలలో ఎక్కువగా సెన్సార్‌లు వాడే అవకాశం ఉన్న దృష్ట్యా వాటి నుంచి సేకరించే సమాచారం ఆధారంగా తయారీలో మార్పుచేర్పులు చేయివచ్చునన్నారు.

కార్యక్రమంలో సొసైటీ ఆఫ్ ఆటోమోటిక్ ఇంజనీర్స్ గీతం విద్యార్థి విభాగం కో-ఆర్డినేటర్ అశ్విన్ సూర్య, కాంపిటిన్సీస్ ఫ్యాక్టరీ వ్యవస్థాపకుడు ఎస్.డి.సూరజ్, కార్యక్రమ కో-ఆర్డినేటర్‌లు అబ్దుల్ రజాక్, సి.హెచ్. కోదండరామారావు తదితరులు పాల్గొన్నారు.

# పశుగణాభివృద్ధికి ఏపీసీఏఆర్ఎల్, సీసీఎంబీ మధ్య ఒప్పందం

అమరావతి: ఏపీ ప్రభుత్వానికి సీసీఎంబీ పరిశోధన సంస్థ మధ్య కీలక ఒప్పందం జరిగింది. పశుగణ రంగంలో అత్యున్నత స్థాయి పరిశోధనల కోసం ఏపీసీఏఆర్ఎల్, సీసీఎంబీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం.. ఏపీసీఏఆర్ఎల్ ఆధ్వర్యంలో నడుస్తున్న అంతర్జాతీయ స్థాయి ప్రయోగశాలల్లో ఇకనుంచి సీసీఎంబీ పరిశోధన కార్యక్రమాలు సాగించనుంది. పశుగణ సమస్యలకు పరిష్కారం చూపటమే కాక.. విజ్ఞాన మార్పిడీ, నైపుణ్య శిక్షణ ద్వారా రైతుల జీవనోపాధిని, ఆదాయాన్ని మెరుగుపర్చడం ఒప్పందంలోని కీలకాంశం. తన సమక్షంలో జరిగిన ఈ ఒప్పందంపై సీఎం చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. పశుగణ రంగంలో రెండంకెల వృద్ధి సాధనకు ఏపీసీఏఆర్ఎల్, సీసీఎంబీ మధ్య జరిగిన ఒప్పందం ముందడుగు కాగలదని విశ్వాసం వ్యక్తం చేశారు.


చదవండి
చదివించండి
విజయభాను

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750


## మళ్లీ ఎంపీగానే పోటీ
# చేయాలనుంది



అమరావతి: భాజపా తనకు దక్కిన అవకాశాన్ని కేంద్రంలో సద్వినియోగం చేసుకోలేకపోయిందని కేంద్ర మాజీ మంత్రి అశోకగజపతి రాజు అభిప్రాయపడ్డారు.

అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో ముఖ్యమంత్రిని కలిసిన ఆయన ధర్మాబాద్ న్యాయస్థానం నోటీసులు, పరిణామాలపై చర్చించారు. అనంతరం టీడీఎల్పీలో మీడియాతో ముచ్చటించారు. బాబ్లీ పోరాటం, ధర్మాబాద్ పోలీస్ తీరును గుర్తుచేసుకున్నారు. ధర్మాబాద్‌లో పోలీసులు తెలుగుదేశం నేతల పట్ల దారుణంగా వ్యవహరించారని, తాగునీటి కోసం కూడా తీవ్ర ఇబ్బంది పెట్టారని అశోక గజపతిరాజు తెలిపారు. తెలంగాణ రైతుల హక్కుల కోసం తెలుగుదేశం పార్టీ చారిత్రక పోరాటం చేసిందని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో తాను ఎంపీగా నిలబడాలా.. ఎమ్మెల్యేగా పోటీచేయాలా అనేది పార్టీ నిర్ణయిస్తుందన్నారు. తనకు మాత్రం ఎంపీగానే బరిలో నిలవాలని ఉందన్నారు. జగన్ తన తండ్రి రాజ్యం తెస్తానని అంటున్నారని..., ఆనాటి దారుణ పాలన ఎవరికీ అవసరం లేదని వ్యాఖ్యానించారు. తన కుమార్తె ఎన్నికల్లో పోటీ చేసే విషయంపై తానేమీ ఏమి చెప్పలేన్నారు. రాజకీయాలంటే అంత సులభం కాదని, జాతీయపార్టీలు క్రమంగా ప్రజలకు దూరం అవుతున్నాయని వివరించారు.

# పెట్రోల్ ధరలపై మాదేముంది?

## పెట్రోలియం మంత్రి



న్యూఢిల్లీ: ఇంధన ధరలు రోజురోజుకూ పెరుగుతుండడంపై కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్లను జీఎస్టీ పరిధిలోకి తీసుకు రావాల్సిందేనని స్పష్టం చేశారు. త్వరలో ప్రధాని నరేంద్రమోదీ ఒడిశా పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించేందుకు ఆయన ఝర్సుగూడ వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ...

పెట్రోల్, డీజిల్ జీఎస్టీ పరిధిలోకి రావాల్సిందేనని భావిస్తున్నాను. దీనిపై జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవాలి. జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కేంద్రం కంటే రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండే అధికారమే ఎక్కువ.. అని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగానే పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గించాలని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను కోరారు. కొన్ని నెలల క్రితమే పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీని తగ్గించిందన్నారు.





ఆన్‌లైన్‌లో చేరడం సులభం
పదవీ విరమణకై పొదుపు చేసుకునేందుకు

1.15 కోట్ల ఖాతాదారులకు చేరువలో

ప్రయోజనాలు & లక్షణాలు

● 18-40 సంవత్సరాల వయస్సు గల ప్రతి భారతీయ పౌరుడు ఎపివైలో చేరగలడు. ● 60 సంవత్సరాల తర్వాత ఖాతాదారుడికి తప్పనిసరిగా కనీసం రూ. 1000 - 5000 వరకు ఫించను ● ఖాతాదారుని మరణానంతరం అదే ఫించను భాగస్వామికి అందును. ● భాగస్వామి మరణానంతరం నామినీకు రూ. 1.7 నుంచి 8.50 లక్షల ఫించను సొమ్ము తిరిగి అందును. ● ప్రారంభం, కూడబెట్టే మరియు ఫించను దశల్లో పన్ను ప్రయోజనాలు

ఎలా నమోదు కావాలి:

1వ అడుగు: http://enps.nsdl.com కు లాగాన్ అయ్యి, ఎపివై విండోలో ఆధార్ వర్చువల్ ఐడిను నమోదు చేయండి మరియు ఆధార్ నమోదిత మొబైల్‌కు పంపిన ఓటిపిను ఫీడ్ చేయండి.

2వ అడుగు: బ్యాంకు/శాఖా వివరాలు, ఖాతా నెంబరు మరియు చిరునామాలను కల్పించండి. (బ్యాంకు పరిశీలిస్తుంది)

3వ అడుగు: పెన్షను నగదు, జమ చేయు నగదు, భాగస్వామి పేరు మరియు నామినీ తదితర వివరాలు పూరించండి.

4వ అడుగు: ఫారంను పరిశీలించేందుకు ఇ-సైన్ చేయండి.

నమోదు ప్రక్రియ విజయవంతమైనచో మీ ఖాతా నుంచి బ్యాంకు తొలి చందాను డెబిట్ చేసుకొని పిఆర్ఎఎన్‌ను అందిస్తుంది.

వివరాలకై టోల్‌ఫ్రీ నెంబరు 1800-110-069కు కాల్ చేయండి.

PFRDA
National Pension System Trust
www.pfrda.org.in

భారత ప్రభుత్వపు పెన్షను ప్రయోజనాలు తప్పక పొందేందుకు 60 సంవత్సరాల వరకు క్రమం తప్పకుండా చందాను చెల్లించండి


## ఖేల్‌రత్నకు కోహ్లీ పేరును
# ప్రతిపాదించిన సెలక్షన్ కమిటీ



దిల్లీ: భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లీ, వెయిట్ లిఫ్టింగ్ ప్రపంచ ఛాంపియన్ మీరాబాయి చాను పేర్లను ఈ ఏడాది రాజీవ్ గాంధీ ఖేల్‌రత్న అవార్డుకు సిఫార్సు చేశారు. ఈ మేరకు అవార్డుల సెలక్షన్ కమిటీ వర్గాలు మీడియాకు తెలిపాయి. టీమిండియా కెప్టెన్, ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్‌లో నంబర్ వన్ బ్యాట్స్‌మన్ అయిన కోహ్లీ పేరును 2016లో ఖేల్‌రత్న అవార్డు కోసం పరిశీలించారు. అయితే అప్పుడు సెలక్షన్ కమిటీ ఆయన పేరును పక్కనబెట్టింది. తాజాగా మరోసారి కోహ్లీ పేరును బీసీసీఐ నామినేట్ చేసింది. ఈసారి సెలక్షన్ కమిటీ కూడా కోహ్లీని ప్రతిపాదించింది.

ఈ ప్రతిపాదనకు కేంద్ర క్రీడాశాఖ మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్ కూడా ఆమోదం తెలిపితే.. ఈ అత్యున్నత పురస్కారం అందుకునే మూడో క్రికెటర్‌గా కోహ్లీ నిలుస్తారు. ఇప్పటివరకు 1997లో క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్, 2007లో మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఖేల్‌రత్న అందుకున్నారు.

ఇక గతేడాది ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 48కేజీల విభాగంలో స్వర్ణం సాధించిన వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను పేరును కూడా కోహ్లీ పేరుతో పాటు సెలక్షన్ కమిటీ సిఫార్సు చేసింది.

ఈ ఏడాది కామన్వెల్త్ గేమ్స్‌లోనూ పసిడి పతకం సాధించిన చాను.. గాయం కారణంగా ఇటీవల జరిగిన ఏషియన్ గేమ్స్‌లో పాల్గొనలేదు. కాగా.. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్ పేరును కూడా ఖేల్‌రత్న పురస్కా రానికి పరిశీలిస్తున్నట్లు సమాచారం.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com